



కసాపురంలో హనుమద్ వ్రతాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

6

ఆశలు అధఃపాతాళానికి..

కుప్పకూలిన టమోటా ధరలు

- 16 కేజీల బాక్స్ రూ. 20 నుంచి రూ.200
- కొన్ని రోజుల కిందట బాక్స్ రూ.800
- నాలుగైదు రోజుల్లోనే తలకిందులైన ధరలు

- వివరాలు 6లో...



ఇక స్వర్ణ పంచాయతీలు..!

ఆన్‌లైన్‌లో పల్లె సేవలు
వచ్చేనెల నుంచి డిజిటలైజేషన్
స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో వివరాలు
ఆన్‌లైన్‌లోనే ధ్రువీకరణ పత్రాలు
ఎక్కడి నుంచైనా
పన్నులు చెల్లించే అవకాశం

7



పంచాయతీ కార్యాలయం

కన్నుల పండువగా హనుమద్ వ్రతం

పాల్గొన్న వేలాది మంది భక్తులు



వ్రతంలో పాల్గొన్న హనుమాన్ మాలధారులు

ఇల్లు మీది.. ఇసుక మాది..!

జగనన్న ఇళ్ల నిర్మాణంలో అక్రమాలు

- ఇసుక పక్కదారి
- లబ్ధిదారులకు తెలియకుండానే తంతు
- లబోదిబోమంటున్న బాధితులు

ధర్మవరం మండలం చిగిచెర్ల గ్రామానికి చెందిన సరోజమ్మ గత వైసీపీ పాలనలో జగనన్న ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకుంది. ఇల్లు మంజూరైంది. అనివార్య కారణాలతో కట్టుకోలేకపోయింది. తాజాగా ఇంటి నిర్మాణం చేపట్టాలని నిర్ణయించుకుంది. దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయానికెళ్లింది. అక్కడ చెక్ చేసిన సిబ్బంది.. ఇదివరకే ఇల్లు మంజూరైందనీ, ఇసుక కూడా ఇచ్చినట్లు చెప్పారు. దీంతో ఆమె ఖంగుతింది. తాను ఇంటి నిర్మాణమే చేపట్టకుంటే ఇసుక ఎలా ఇస్తారని నిలదీసింది. తమకేమీ తెలియదనీ, అప్పట్లో పనిచేసిన అధికారులను అడగాలని చెప్పి సచివాలయ సిబ్బంది తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని బాధితురాలు వాపోయింది. హౌసింగ్ అధికారులను అడగ్గా తమకేమీ తెలియదని వారు కూడా అదే పదం పాడారు. ఇలా మండలంలోని పలు గ్రామాల్లో అడ్డదిడ్డంగా పేర్లు నమోదు చేసుకుని, ప్రభుత్వం అందించిన ఇసుకను అమ్మేసుకుని జేబులు నింపుకున్నట్లు సమాచారం.

Stage	MPRO Date/ Payment Date	MPRO No./ PRO/FTR No.	Material Name/ Cash payment	Quantity	Amount (in Rs.)	Status
NS		24280IMRO31 32389	Sand	5.00 MTs	875	Material Lifted on-04/05/2022
Total					875	

Beneficiary ID : 12370INPI190431
Scheme : PMAY (U) BLC-UDA 20
Beneficiary Status : Disable

Aadhar Details
Beneficiary Aadhar Card No.
XXXXXXXX2841
Beneficiary Name As Per Aadhar Card
SA KE SAROJAMMA
Gender
FEMALE
Allotte Type
Husband-Wife
Rice/Ration Card No.
XXXXXXXXXXXX0037
Spouse Aadhar No.
XXXXXXXX2841

సరోజమ్మ పేరుమీద మంజూరైన ఇల్లు, ఇసుక తోలుకున్నట్లు ఆన్‌లైన్‌లో పొందుపరచిన దృశ్యం

ధర్మవరంరూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో జగనన్న ఇళ్ల నిర్మాణంలో యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డారన్నది నిర్వివాదాంశం. అధికారులు.. అప్పటి వైసీపీ నాయకులతో చేతులు కలిపి అందినకాడికి దోచేశారు. ఇష్టారాజ్యంగా సిమెంటు అమ్ముకోవడంతోపాటు ఇసుక కూపన్లు, కడ్డీలను పక్కదారి పట్టించారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణమే చేపట్టకపోయినా.. బిల్లులు మంజూరు చేసుకుని, దిగమింగారు. గ్రామాల్లో ఇల్లు కట్టకపోయినా వైసీపీ నాయకులు చెప్పిన వారికి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు బిల్లులు మంజూరు చేసినట్లు స్పష్టమవుతోంది. ఈ అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి.

ప్రస్తుతం ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలకు వెళ్తున్న లబ్ధిదారులు.. అక్కడి సిబ్బంది చెబుతున్న విషయాలతో ఖంగుతింటున్నారు. గత వైసీపీ హయాంలోనే ఇల్లు కట్టుకున్నట్లు, ఇసుక ఇచ్చినట్లు ఆన్‌లైన్‌లో ఉందని చెబుతుండడంతో లబ్ధిదారులు అవాక్కవుతున్నారు. ఈ అక్రమాలపై కూటమి ప్రభుత్వం విచారణ చేసి, అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం ఇల్లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఇసుక పక్కదారి

గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక దొరకడమే గగనంగా ఉండేది. సామాన్య ప్రజలు ఇసుక దొరక్క ఇళ్ల నిర్మాణాలు కూడా చేపట్టలేదు. పేదల ఇళ్ల కోసం మంజూరైన ఇసుకపై అధికారుల కన్నుపడింది. గ్రామస్థాయిలో కొంతమంది అధికారులు.. లబ్ధిదారులకు మంజూరైన ఇసుకకు సంబంధించిన కూపన్లు ఇవ్వకుండా దర్జాగా అమ్మేసుకున్నట్లు బాధితులు వాపోతున్నారు. టిప్పర్ ఇసుక ధర రూ.15 వేలకుపైగా రేటు కట్టి, అమ్ముకున్నట్లు తెలుస్తోంది.

సమాచారం ఇవ్వకుండా సాకులు

గత వైసీపీ పాలనలో మండలంలోని చిగిచెర్ల, ధర్మపురి, గొట్లూరు-1, గొట్లూరు-2, కుణుతూరు, పోతుకుంట, రావులచెరువు, రేగాటిపల్లి గ్రామాలకు మాత్రమే ఇళ్లు మంజూరు చేశారు. ఆయా గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాల్లో అవకతవకలకు పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. వీటిపై విచారణ చేస్తే భారీగా అక్రమాలు బయటకు వస్తాయని పలువురు పేర్కొంటున్నారు. వైసీపీ హయాంలో మంజూరైన ఇళ్ల లబ్ధిదారుల వివరాలను గ్రామాల వారీగా ఇచ్చేందుకు హౌసింగ్ అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. మండల అధికారులను అడిగితే గ్రామ ఇంజనీర్ అసిస్టెంట్ల నుంచి తీసుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లను సంప్రదిస్తే మండల అధికారి వద్ద తీసుకోవాలని చెప్పి తప్పించుకుంటున్నారు. దీనినిబట్టి ఏస్థాయిలో ఇళ్ల నిర్మాణాల్లో అవినీతి జరిగిందో అర్థం చేసుకోవచ్చు.

వైసీపీ హయాంలో మండలంలో ఇళ్ల నిర్మాణాల వివరాలివీ..

గ్రామ పంచాయతీ	మంజూరైన ఇళ్లు	పూర్తయినవి	మొత్తం డ్రాచేసిన నగదు (మెటీరియల్ కలిపి..)
చిగిచెర్ల	144	81	రూ.1.36కోట్లు
ధర్మపురి	75	48	రూ.91లక్షలు
గొట్లూరు-1	209	105	రూ.1.91కోట్లు
గొట్లూరు-2	64	48	రూ.81లక్షలు
కుణుతూరు	167	78	రు.1.72కోట్లు
పోతుకుంట	158	73	రూ.1.57కోట్లు
రావులచెరువు	128	72	రూ.1.23కోట్లు
రేగాటిపల్లి	82	43	రూ.83లక్షలు
మొత్తం	1027	548	రూ.10.40కోట్లు

మా దృష్టికి తెస్తే చర్యలు తీసుకుంటాం

ఇల్లు కట్టకపోయినా వారి పేరుమీద ఇసుక, సిమెంటు తీసుకున్నట్లు మా దృష్టికి తెస్తే విచారిస్తాం. ఆరోపణలు వాస్తవాలని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

-శంకర్‌లాల్, హౌసింగ్ డీఈఈ, ధర్మవరం

వైసీపీది ఫ్లాప్ షో

ఐదేళ్లలో అన్నదాతకు అన్యాయం

రైతు సంక్షేమం గురించి మాట్లాడే అర్హత ఆ పార్టీ నాయకులకు లేదు: ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మండిపాటు

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అన్నదాతకు అండగా పేరుతో వైసీపీ నాయకులు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నా అట్టర్ ఫ్లాప్ అయిందని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. రైతు సంక్షేమం గురించి మాట్లాడే అర్హత వైసీపీ నాయకులకు లేదని మండిపడ్డారు. వైసీపీ అధికారంలో ఉన్నపుడు రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. ఒక్క డ్రిప్ పరికరం, ఒక్క స్ప్రింక్లర్ ఇచ్చారా అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరాన్ని నాశనం చేసి, అమరావతి రైతులను హింసించి వేధించి జైలుకు పంపిన చరిత్ర జగన్‌దన్నారు. గత టీడీపీ హయాంలో రాష్ట్రమంతటికీ కలిపి రూ.2600 కోట్ల బీమా మంజూరైతే ఉమ్మడి అనంతపురం జిల్లా రైతులకే రూ.1650 కోట్లు కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా రూ.1200 కోట్ల బీమా సొమ్ము వస్తే దానిని తుంగలో తొక్కిన చరిత్ర వైసీపీ పాలకులదన్నారు. రైతులకు మూరెడు డ్రిప్పు పైపు ఇవ్వని వైసీపీ నాయకులు.. రైతుల గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమిప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

జగన్ పాలనలో రైతు ఆత్మహత్యల్లో టాప్

టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప

హిందూపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో రైతు ఆత్మహత్యల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. జగన్ రెడ్డి పాలనలో రుణ భారంతో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారనీ, వారి కుటుంబాలు అప్పుల్లో కూరుకుపోయారన్నారు. కూటమి పాలనలో రైతుకు అండగా నిలుస్తున్నామన్నారు. జగన్.. రైతులకు చేసిన ద్రోహాన్ని మరచి, ఇప్పుడు పోరుబాట అంటూ నిరసనలు తెలపడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల్లో 11 సీట్లు ఇచ్చి ప్రజలు బుద్ధి చెప్పినా ఇంకా జగన్ మారలేదన్నారు.

సూర్యఘర్‌తో విద్యుత్ విక్రయించొచ్చు

విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర

బత్తలపల్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ వినియోగదారులందరూ సూర్యఘర్ పథకం ద్వారా ఉత్పత్తిదారులు అవుతారని విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర తెలిపారు. స్థానిక ఓ కల్యాణ మండపంలో శుక్రవారం సూర్యఘర్ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఈ సురేంద్ర మాట్లాడుతూ.. ప్రస్తుతం గృహ వినియోగదారులు విద్యుత్ కొనుగోలు చేస్తున్నారన్నారు. వీరంతా ఉత్పత్తిదారులుగా మారాలనే ఉద్దేశంతో సూర్యఘర్ పథకాన్ని ప్రవేశ పెట్టారన్నారు. తద్వారా ప్రతి ఇంటిలో సౌర విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చన్నారు. ఇళ్లపై సోలార్ ఏర్పాటుకు కేంద్రం సబ్సిడీ అందిస్తుందన్నారు. సూర్యఘర్ పథకం లబ్ధిదారులు ఇంటి అవసరాలకు ఉపయోగించుకుని, మిగిలిన దానిని విద్యుత్ శాఖకు విక్రయించవచ్చన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ శివరాం, ఏడీలు నరసింహారెడ్డి, లక్ష్మీనారాయణ, డివిజన్ పరిధిలోని ఏఈలు శివయ్య, మదన్‌మోహన్, నాగభూషణ, కొండారెడ్డి పాల్గొన్నారు.

రాగి సాగుతో అధిక లాభాలు

జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకుడు

మడకశిర రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాగి పంట సాగుతో అధిక దిగుబడులు, లాభాలు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకుడు సనావుల్లా పేర్కొన్నారు. మండలంలోని ఆర్ అనంపురం గ్రామంలో శుక్రవారం రాగి పంట సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సనావుల్లా మాట్లాడుతూ.. రాగి పంట తక్కువ పెట్టుబడులతో ఎక్కువ ఆదాయం ఇస్తుందన్నారు. రాగి సాగు లాభదాయకమనీ, రైతులు విరివిగా పంట పెట్టాలన్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.4290 నిర్ణయంచిందన్నారు. తెగుళ్లను తట్టుకుని, అధిక దిగుబడులను ఇచ్చే కొత్త వంగడాలైన వకుల, ఇంద్రావతి, తిరుమలను రైతులు సాగు చేయాలని సూచించారు. అనంతరం రాగి పంటకు సోకే తెగుళ్లు, వాటి నివారణపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ కృష్ణమీనన్, మండల వ్యవసాయాధికారి తిమ్మప్ప, రైతులు పాల్గొన్నారు.

వక్క మొక్కల నరికివేత

అమరాపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుణేహళ్లి గ్రామ రైతు గొల్ల గజ్జప్ప సాగుచేసిన 200 వక్కచెట్లను గుర్తుతెలియని దుండగులు గురువారం రాత్రి నరికేశారు. రైతు 300 వక్క మొక్కలు నాటాడు. మూడేళ్లుగా కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాడు. వాటిలో 200 మొక్కలను నరికేయడంతో రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. దీనిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించాడు.



నరికివేసిన వక్క మొక్కలు

నేడు సాగునీటి సంఘాల ఎన్నికలు

ఏర్పాట్లు పూర్తి

పుట్టపర్తి టౌన్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. జిల్లాలోని 216 మైనర్ ఇరిగేషన్ చెరువులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రక్రియ కొనసాగుతుంది. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

ఏకగ్రీవాలకే అవకాశం

సాగునీటి సంఘాల ఎన్నికల్లో అత్యధిక శాతం ఏకగ్రీవమయ్యే అవకాశం ఉంది. కూటమి సానూభూమతిపరులే అన్ని స్థానాలనే కైవసం చేసుకునే అవకాశమున్నట్లు కనిపిస్తోంది. వైసీపీ సానుభూతిపరులు పోటీకి ఆసక్తి చూపట్లేదు. పదేళ్ల తరువాత సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తుండడంతో పోటీ చేయడానికి కూటమి సానుభూతి పరులు ఉత్సాహంగా ఉన్నారు. జిల్లాలో 1,476మంది సభ్యులు ఎన్నిక కానున్నారు. 77,454 మంది రైతులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఒక్కో మైనర్ ఇరిగేషన్ చెరువుకు ఆరుగురు ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు ఎన్నికకానున్నారు. వారిలో ఒకరు అధ్యక్షుడిగా, మరొకరు ఉపాధ్యక్షుడిగా కొనసాగుతారు.

ఘనంగా బాబయ్యస్వామి మొదటి గంధంపూజ

పెనుకొండ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రసిద్ధిచెందిన బాబయ్యస్వామి దర్గాలో స్వామివారి 752వ మొదటి గంధం పూజ మహోత్సవం శుక్రవారం రాత్రి 11గంటలకు అట్టహాసంగా నిర్వహించారు. మొదటి గంధం పీఠాధిపతి సజ్జద్‌బాబా స్వగృహం నుంచి గంధం పళ్లాన్ని శిరస్సుపై ఎత్తుకుని డ్రమ్స్, వాయిద్యాలు, ఫకీర్ల విన్యాసాలతో దర్గాకు చేరుకున్నారు. దర్గాలోని స్వామి సమాధికి గంధంతో పూజలు నిర్వహించారు. గంధం పూజలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



పూజకు గంధం తీసుకెళ్తున్న మొదటి గంధం తీసుకెళ్తున్న దృశ్యం

దర్గా అభివృద్ధికి రూ.కోటి మంజూరు

మంత్రి సవిత

పెనుకొండ టౌన్: బాబయ్య దర్గా అభివృద్ధికి కూటమి ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేసినట్లు బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. బాబయ్యస్వామి ఉరుసును పురస్కరించుకుని ప్రభుత్వం తరఫున మంత్రి సవిత, రాష్ట్ర మైనార్టీ సలహాదారు షరీఫ్ చాదర్ సమర్పించారు. దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా.. వారికి స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ.. ఉరుసుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రభుత్వం తరఫున చాదర్ సమర్పించడం ఆనందంగా ఉందన్నారు. షరీఫ్ మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా నిర్వహించే పవిత్ర పండుగ బాబయ్యస్వామి గంధం ఉరుసు అన్నారు. స్వామి ఇచ్చిన సందేశం ప్రకారం అందరూ సమానమనీ, సోదరభావంతో మెలగాలన్నారు.



చాదర్‌ను ఊరేగింపుగా తీసుకొస్తున్న మంత్రి సవిత

అమ్మ వాటా ఇవ్వాల్సిందే..

మేనమామ ఇంటి ముందు నిరసన

హిందూపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తన అమ్మ వాటా ఇవ్వాల్సిందేనంటూ కూతురు.. మేనమామ ఇంటి ముందు నిరసనకు దిగారు. పట్టణ పరిధి మేళాపురానికి చెందిన లక్ష్మీదేవమ్మకు నలుగురు సంతానం. వారిలో నారాయణమ్మ ఒకరు. ఆమె వాటా ఇవ్వలేదంటూ ఆమె కుమార్తె వసంతలక్ష్మి, కుటుంబ సభ్యులు.. మేనమామ లక్ష్మీప్రసాద్ ఇంటి ముందు శుక్రవారం నిరసన తెలిపారు. వసంతలక్ష్మి మాట్లాడుతూ.. ఉన్న ఆస్తిని ముగ్గురు మాత్రమే భాగాలు పెట్టుకున్నారనీ, కొంతకాలంగా తన అమ్మ వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా మేనమామ ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడన్నారు. తనకు పెళ్లి చేశాననీ, భాగం ఇచ్చేది లేదని చెబుతున్నాడని వాపోయారు. చేసేదిలేక మేన మామ ఇంటి ముందు ఆందోళన చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అవ్వతాతలుసంపాదించిన ఆస్తిలో వాటా ఇవ్వాల్సిందేనంటూ డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకుని వసంతలక్ష్మి కుటుంబ సభ్యులకు సర్దిచెప్పారు. సమస్య ఉంటే ఫిర్యాదు చేయాలన్నారు. దీంతో ఆమె ఆందోళన విరమించారు.



మేనమామ ఇంటి ముందు నిరసన తెలుపుతున్న వసంతలక్ష్మి (కుడి)

వైభవంగా ధ్వజారోహణ



ధ్వజారోహణం చేస్తున్న పండితులు


మడకశిర రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు శుక్రవారం ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా సాగింది. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. ఉదయం నుంచి స్వామివార్ల ఆలయాల్లో హనుమద్ వ్రతం, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు దంపతులు, టీ డీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండమల తిప్పేస్వామి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయంలో పూర్ణకుంభతో స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు పూజలు నిర్వహించారు. అనంతరం హోమాది కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నరసింహరాజు, భక్తులు పాల్గొన్నారు.

నేడు స్వామి వారి కల్యాణోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.



నరసింహస్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు


బతుకు బండి


అనంత శివారు: వృక్ష సంపదకూ వణుకు.. చలికాలం మరి..!


అనంత రైల్వే స్టేషన్: కదలక మెదలక.. కనుచూపు మేరలో రైలు కనిపించక..

చలి వేకువ

పలకరించకు నన్ను
గజ గజా వణికే చలిలో..!
పెదవి పెగలదు నువ్వెంత పిలిచినా..!
తెలతెలవారే వేళ..
మంచు తెమ్మరలు కమ్మేశాయి..
హిమ బిందువులు..
చలిలో కలిసి సూదుల్లా పొడుస్తున్నాయ్..!
నగరం పొగచూరిన వేళ..
పలకరించకు నన్ను..!
ఉబ్బసం లేకపోయినా..
ఊపిరి అందడం లేదు..!
భయపడకపోయినా..
వణుకు ఆగడం లేదు..!
పలకరించకు నన్ను..!


శాగబారిన మనిషీ వణికిపోతున్నాడు.. ఏం చలిరా బాబూ..!


అనంత హైవే: చలికాల మహిమ..! మండే సూరీడు.. నిండు చందురుడిలా..!

గ్రంథాలయ ఉద్యోగుల కార్యవర్గం ఎంపిక


కొత్త కార్యవర్గ సభ్యులు

అనంతపురం విద్య, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం కొత్త కార్యవర్గం ఎంపిక చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాం అధ్యక్షతన శుక్రవారం ఎన్జీవో హోంలో సమావేశం నిర్వహించారు. గతంలో ఉన్న జిల్లా అడ్‌హక్ కమిటీని రద్దు చేసి నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా కటిక జయరాం, సహాధ్యక్షులుగా కృష్ణ, రమేష్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బొజ్జేనాయక్, సహాయ కార్యదర్శిగా ఇబ్రహీం, ట్రెజరర్‌గా శ్రీనివాసులు, కార్యవర్గసభ్యులుగా వెంకట రమణప్ప, మల్లికార్జున, నల్లమ్మ, మహిళా కార్యదర్శులుగా ముత్యాలమ్మ, ఉషారాణి, శాంతమ్మ, ఉజ్జనేశ్వరి, నాగరాజును ఎంపికచేశారు. వారితో రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు కింద జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబ్జి, కన్వీనర్ తోకల రాంబాబు, ఇతర నేతలు పాల్గొన్నారు.

రెండు స్వచ్ఛంద సంస్థలకు జాతీయ అవార్డులు


అవార్డు అందుకుంటున్న సెంటర్ ఫర్ కలెక్టివ్ డెవలప్‌మెంట్, ఫార్మ్ వేదా సంస్థ ప్రతినిధులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని సెంటర్ ఫర్ కలెక్టివ్ డెవలప్‌మెంట్, ఫార్మ్‌వేదా స్వచ్ఛంద సంస్థలకు జాతీయ స్థాయి అవార్డులు దక్కాయి. వికసిత్ భారత్ నిర్మాణంలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పేదలు, రైతుల జీవనోపాధుల పెంపునకు ఈ సంస్థలు కృషి చేస్తున్నాయి. వీటి సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థ సోషల్ అండ్ బిజినెస్ ఎంటర్‌ప్రైజెస్ రెస్పాన్సిబుల్ (సబేరా) అవార్డుకు ఎంపిక చేశారు. దేశరాజధాని ఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన సబేరా అవార్డుల ప్రదానోత్సవంలో సీసీడీ ప్రాజెక్ట్ మేనేజర్లు నటరాజ్, శంకర్, విఠల్‌రావు, ఫార్మ్‌వేదా సంస్థ సీఈఓ కౌశల్ అవార్డులు అందుకున్నారు. సీసీడీ వ్యవస్థాపకుడు త్రిలోచన్ శాస్త్రి మేనేజర్లను అభినందించారు.

ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడటమే లక్ష్యం

■ డీఆర్ఎం విజయకుమార్



సదస్సులో మాట్లాడుతున్న డీఆర్ఎం విజయ కుమార్

గుంతకల్లు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విపత్తులు, ప్రమాదాలు సంభవించినప్పుడు వీలైనన్ని ఎక్కువ ప్రాణాలను కాపాడటానికి సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) సభ్యులు కృషి చేయాలని డీఆర్ఎం విజయకుమార్ పేర్కొన్నారు. సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ వార్షికోత్సవంలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే, సదరన్ రైల్వే జోన్ల పరిధిలో తర్ఫీదు పొందిన రైల్వే ఉద్యోగుల సదస్సును గుంతకల్లు డివిజన్ హెడ్‌క్వార్టర్సులోని రైల్వే స్టేషన్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. సీడీఓ సభ్యులు చెన్నైలో ప్రదర్శించిన మాక్ డ్రిల్ విన్యాసాలను వీడియో ప్రజెంటేషన్ నిర్వహించారు. అనంతరం ప్రతిభచాటిన సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ సభ్యులకు మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, దక్షిణ మధ్య రైల్వే డీజీఎం ఉదయనాథ్ కోట్ల, ఏడీజీఎం కేఎల్ఎస్ స్వామి, సీనియర్ సీడీఐ టీ సుధీర్ బాబు, సదరన్ రైల్వే ఏడీజీఎం చెలియన్, సీనియర్ సీడీఐ చిట్టమల్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్బిటార్ పరీక్షల్లో గోవిందరాజులు ఉత్తీర్ణత


గోవింద రాజులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ చదరంగసమాఖ్య, అఖిలభారత చదరంగ సమాఖ్యలు సంయుక్తంగా శుక్రవారం రాజమండ్రిలో నిర్వహించిన సీనియర్ నేషనల్ ఆర్బిటార్ పరీక్షల్లో అనంతపురానికి చెందిన కోచ్ గోవిందరాజులు ఉత్తీర్ణత సాధించారు. నేషనల్, ఇంటర్నేషనల్ చెస్ పోటీలకు గోవిందరాజులు ఆర్బిటార్‌గా పనిచేసే అవకాశం వస్తుంది.

ఆశలు అధఃపాతాళానికి..

కుప్పకూలిన టమోటా ధరలు

- 16 కేజీల బాక్స్ రూ.20 నుంచి రూ.200
- కొన్ని రోజుల కిందట బాక్స్ రూ.800
- నాలుగైదు రోజుల్లోనే తలకిందులైన ధరలు


తోటలోనే ఎర్రగా మాగిపోయిన టమోటా

నాలుగు రోజుల్లోనే ..



నాకున్న మూడు ఎకరాల్లో టమోటా పంట సాగు చేశారు. నాలుగు రోజుల కిందట 16 కిలో ల టమోటా బాక్స్ ధర రూ.800 లకు అమ్ముడుపోయింది. ఆ ధర ఇప్పుడు కేవలం రూ. 20లకు పడిపోయింది. ఇలా ధర ఒక్కసారిగా పడిపోవడంతో ఆందోళన చెందుతున్నాం.

- రామాంజనేయులు, టమోటా రైతు, మేళ్లకుంట


ఒకే చోట కుప్పగా పోసిన టమోటా

కళ్యాణదుర్గం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు రైతుల ఆశలతో దోబూచులాడుతున్నాయి. ధర బాగుంది కదా అని సాగు చేస్తే పంట చేతికందేలోపు అధఃపాతాళానికి చేరుతున్నాయి. కూలీల ఖర్చు కూడా గిట్టుబాటు కావడం లేదు. దీంతో పలువురు రైతులు తోటల్లోనే టమోటాలను పశువుల మేతగా వదిలేసే దుస్థితి నెలకొందని వాపోతున్నారు. మొన్నటి వరకు అనంతపురం, కర్ణాటక(కోలార్), మదనపల్లి మార్కెట్‌లో 16 కిలోల టామోటా బాక్స్ రూ.800లు పలికింది. అదే ప్రస్తుతం రూ. 20 నుంచి రూ. 200ల మధ్య నడుస్తోంది. ఏ1 గ్రేడ్ టమోటాలు మాత్రమే బాక్స్ రూ. 200లు ధర పలుకుతోంది. ఈ ధరలు ఇంకా తగ్గే అవకాశాలు ఉన్నట్లు మార్కెట్ వర్గాల సమాచారం. టమోటా ధరలు నిలకడగా లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ మండలాల్లో సుమారు 487 ఎకరాలకు పైబడి టమోటా పంటను సాగు చేశారు. ఎకరాకు రూ.లక్ష ఖర్చు చేసి, ఒక్కొక్క రైతు సరాసరి రెండున్నర ఎకరాలకు పైబడి సాగు చేశారు. టమోటా పంటలన్నీ కోతకు వస్తున్న సమయంలో ఇలా ధరలు పడిపోవడంతో నష్టాలు తప్పవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలు తగ్గుముఖం పట్టడానికి కారణాలు అర్థం కావడం లేదు. టమోటాను మొన్నటివరకు కొనేందుకు వ్యాపారులు ఎగబడ్డారు. ధరలు బాగుంటాయన్న ఆశతో విపరీతంగా రైతులు టమోటాను సాగు చేశారు. కానీ ఆశలు ఫలించడం లేదు.


టమోటాను తొలగిస్తున్న కూలీలు

పెట్టుబడి కూడా చేతికిరాదు



నేను మూడు ఎకరాల్లో టమోటా సాగు చేశా. సుమారు రూ. 3 లక్షలదాకా పెట్టుబడి పెట్టా. 16 కిలోల టమోటా బాక్స్ మొన్నటివరకు ఏడెనిమిది వందల రూపాయాల మధ్య ఉండేది. అదే ధర ఇప్పుడు రూ.20కి పడిపోయింది. దీంతో పెట్టుబడి కూడా చేతికి రాని పరిస్థితి నెలకొంది.

-నరేష్, టమోటా రైతు, ఒంటారెడ్డిపల్లి

తోటల్లోనే వదిలేసే పరిస్థితి



ధరలు భారీగా తగ్గడంతో టమోటాను తోటల్లోనే వదిలేసే పరిస్థితి నెలకొంది. నాలుగైదు రోజుల్లోనే ధరలు ఇలా తలకిందులైతే పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి కనబడటం లేదు. మరికొన్ని రోజులు ధరలు ఇలాగే ఉంటే భారీ నష్టాలు మూటగట్టుకోవాల్సిందే.

- రవి, టమోటా రైతు, ఒంటారెడ్డిపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి



ఈ సారైనా టమోటాతో గట్టెక్కవచ్చునన్న ఆశతో పంట సాగు చేస్తే.. ధరలు భారీగా తగ్గిపోయాయి. టమోటా బాక్స్ రూ.20 అంటే నష్టాలు ఎదుర్కోక తప్పదు. అందుకోసమే టమోటా పంటను సాగు చేయాలంటే భయపడే పరిస్థితులు వచ్చాయి. టమోటా రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

-రామాంజి, టమోటా రైతు, మేళ్లకుంట

మార్కెట్‌కు తగ్గిన కాయలు

అనంతపురంరూరల్: కక్కలపల్లి మార్కెట్‌లో టమోటా ధరలు పతనమయ్యాయి. స్థానిక మార్కెట్ నుంచి ఎగుమతి అయ్యే ప్రాంతాల్లో టమోటా దిగుబడులు అధికంగా వస్తుండటంతో ఇక్కడి టమోటకు డిమాండ్ తగ్గి, ధర పతనమైనట్లు సమాచారం. కొన్నిరోజులుగా నిలకడగా ఉన్న ధరలు గత నాలుగైదు రోజుల నుంచి భారీగా పడిపోయాయి. గతంలో ఓమాదిరి కాయలు, మచ్చలు ఇతరత్రకాయల సైతం మంచి ధర పలికాయి. కిలో గరిష్ఠంగా రూ.30 నుంచి రూ.40మధ్య పలికాయి. కనిష్ఠ ధరలు సైతం రూ.20 నుంచి 30మధ్య ఉన్నాయి. ప్రస్తుతం కాయల నాణ్యత బాగున్నప్పటికీ ధర లేకపోవడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌కు కాయలు కూడా అంతంత మాత్రంగానే వస్తున్నాయి. గతంలో పదిహేను వందల నుంచి 2వేల టన్నుల వరకు వచ్చేవి. ప్రస్తుతం 700 నుంచి 12వందల టన్నుల మధ్య వస్తున్నాయి. కాగా శుక్రవారం మార్కెట్‌కు 1125టన్నుల టమోటా వచ్చాయి. గరిష్ఠ ధర కిలో రూ.10, సరాసరి ధర రూ.6, కనిష్ఠ ధర రూ.4తో అమ్ముడుపోయాయి.


కసాపురంలో హనుమద్ వ్రతాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు, అర్చకులు

కన్నుల పండువగా హనుమద్ వ్రతం

పాల్గొన్న వేలాదిమంది భక్తులు

గుంతకల్లు, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): కసాపురం దేవస్థానంలో శుక్రవారం ఉదయం హనుమద్ వ్రతాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. హనుమద్ మండల, అర్ధ మండల దీక్షలను చేపట్టిన మాలధారులు గురువారం ఇరుముడులతో ఆలయానికి చేరిన సంగతి తెలిసిందే. ఉదయాన్నే ఆంజనేయ స్వామివారి మూల విరాట్టుకు అభిషేకాలు, ప్రత్యేక అలంకారాలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కల్యాణ మండపం వద్ద ఉన్న ఓపెన్ షెడ్‌లో వేదికను ఏర్పాటుచేసి, ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాన్ని అక్కడ ఉంచి సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా హనుమద్ వ్రతాన్ని నిర్వహించారు. మాలధారులు వేదిక ఎదుట భక్తి పారవశ్యంతో వ్రత కార్యక్రమాన్ని వీక్షించారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుటుంబ సమేతంగా హనుమద్ వ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. తర్వాత వేద పండితులు, అర్చకులు ఆనవాయితీని అనుసరించి దీక్షాపరులచే హనుమాన్ మాల విసర్జనగావించారు. వ్రతంలో ఉపయోగించిన హనుమాన్ కంకణాలు, ప్రసాదాల కోసం భక్తులు ఎగబడ్డారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్ శ్రీనాథ్‌గౌడు, బీఎస్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


హనుమద్ వ్రతంలో పాల్గొన్న మాలధారులు

ఎయిమ్స్‌లో అనంత మెడికో సత్తా


భానుప్రసాద్‌కు స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు

అనంతపురం టౌన్, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన మెడికో దేశరాజధానిలో సత్తా చాటాడు. న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌లో ఎంసీహెచ్ ఇన్ యురాలజీ(పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సు)లో ప్రథమ ర్యాంకు సాధించాడు. గత నెలలో పరీక్షలు జరగగా గురువారం రాత్రి ఫలితాలు విడుదల చేశారు. ఇందులో అనంతపురానికి చెందిన భానుప్రసాద్‌యాదవ్ ప్రథమర్యాంకు సాధించాడు. భోపాల్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన ఈయన ఢిల్లీలోని ఎయిమ్స్‌లో పీజీ చదువుతూ గోల్డ్ మెడల్ సాధించాడు. ఈయన తండ్రి ఆత్మకూరు మండలం ఎంఈఓ-2గా పనిచేస్తుండగా, తల్లి క్షీరజ అదే మండలంలోని తోపుదుర్తి జడ్పీ ఉన్నతపాఠశాలలో బయాలజీ టీచర్‌గా పని చేస్తున్నారు. తమ కుమారుడు జాతీయస్థాయిలో ప్రతిభ చాటడంతో ఆ తల్లిదండ్రులు పుత్రోత్సాహంతో పొంగిపోయారు.

జాతీయ చెస్ పోటీలకు నితీష్‌చౌదరి ఎంపిక


నితీష్‌చౌదరి

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన నితీష్‌చౌదరి 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల లేపాక్షిలో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్-14 చెస్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభచాటిన నితీష్‌చౌదరి జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. ఈ పోటీలను మహారాష్ట్రలోని నాందేడ్‌లో వచ్చే ఏడాది జనవరి 21 నుంచి నిర్వహించనున్నారు. నితీష్‌చౌదరిని ఇంటర్నేషనల్ చీఫ్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్‌నాయుడు అభినందించారు.

కుటీర పరిశ్రమలకు సబ్సిడీ

అనంతపురం అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఔత్సాహికులు, డ్వాక్రా మహిళా సంఘాలకు ఆహార శుద్ధి కుటీర పరిశ్రమల స్థాపన కోసం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందని ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు శుక్రవారం తెలిపారు. పీఎంఎఫ్ఎంఈ కింద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, మహిళా సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రాజెక్టు విలువలో లబ్ధిదారులు 10 శాతం భరిస్తే, 35 శాతం ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందన్నారు. మిలిగిన 55 శాతం బ్యాంకుల రుణం లభిస్తుందన్నారు. గరిష్ఠంగా రూ.10 లక్షల దాకా సబ్సిడీని వర్తింపజేస్తారన్నారు. వివరాలకు ఫుడ్ ప్రాసెసింగ్ జిల్లా రిసోర్స్ పర్సన్ హరీష్ సెల్ నెంబర్ 9676796974ను సంప్రదించాలని సూచించారు.

ఇక స్వర్ణ పంచాయతీలు..!

ఆన్‌లైన్‌లో పల్లె సేవలు
వచ్చేనెల నుంచి డిజిటలైజేషన్
స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో వివరాలు
ఆన్‌లైన్‌లోనే ధ్రువీకరణ పత్రాలు
ఎక్కడి నుంచైనా పన్నులు చెల్లించే అవకాశం



వివరాలను పొందుపరుస్తున్న సిబ్బంది

హిందూపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పల్లె సేవలను ఇకపై ఎక్కడి నుంచైనా పొందవచ్చు. గ్రామ పంచాయతీల్లో డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇక మీదట ఎక్కడినుంచైనా పంచాయతీకి పన్ను చెల్లించవచ్చు. కావాల్సిన ధ్రువపత్రాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్.. పంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే డిజిటలైజేషన్ దిశగా ముందుకెళ్తున్నారు. జిల్లాలో 467 పంచాయతీలు ఉండగా అన్నింటిలోనూ వచ్చేనెల నుంచి ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో పల్లె ప్రజల కష్టాలు తీరనున్నాయి. ప్రజలకు వేగంగా, పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందనున్నాయి. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు కావాలంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వారంలోపే జారీ అవుతాయి. ఆన్‌లైన్‌లోనే ఆస్తిపన్ను చెల్లించవచ్చు. ట్రేడ్ లైసెన్స్ పొందవచ్చు. వీటికి సంబంధించి కార్యదర్శులకు డిజిటల్ కీ అందుబాటులోకి తీసుకురానున్నారు. ఏ డిజిటల్ పత్రం కావాలన్నా ఆన్‌లైన్‌లో క్లియర్‌గా ఉండనుంది. జిల్లాలోని 467 పంచాయతీల్లో ఈ కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు. పంచాయతీలు జారీచేసే వివిధ ధ్రువీకరణ పత్రాలకు ప్రజలు తిరగాల్సిన అవసరం ఉండదు. ఇకమీదట సులభంగా సర్టిఫికెట్లు పొందేందుకు పంచాయతీ రాజ్ శాఖ కొత్త విధానానికి శ్రీకారం చుట్టనుంది. మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే వాటిని పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి, డిజిటల్ సంతకాలు చేస్తారు. అనంతరం ప్రజలు ఎక్కడ మీసేవలో దరఖాస్తు చేసుకున్నారో అక్కడే సర్టిఫికెట్లు పొందవచ్చు. ఈ విధానం మున్సిపాలిటీల్లో అమలులో ఉంది. జనవరి నుంచి పల్లెల్లో కూడా అందుబాటులోకి రానుంది.

వైసీపీ నిర్లక్ష్యం

ప్రజలకు సత్వర సేవలందించే ఉద్దేశంతో పంచాయతీలను డిజిటల్ వైపు తీసుకొచ్చేందుకు ఒక పోర్టల్‌ను తెచ్చింది. దీని నిర్వహణ అప్పట్లో నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసీ)కి అప్పగించింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక దానికి నిధులు ఇవ్వకపోవడంతో పోర్టల్ నిర్వహణ గాలికి వదిలేశారు. ఐదేళ్లుగా పంచాయతీలు డిజిటల్ వైపు వెళ్లకుండా మూలనపడింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక స్వర్ణ పంచాయతీ పోర్టల్ నిర్వహణను రాష్ట్ర ఆర్థిక నిర్వహణ సేవాసంస్థకు అప్పగించింది.



స్వర్ణపంచాయతీ పోర్టల్

ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను ప్రభుత్వం పంచాయతీ కార్యాలయాలకు జారీ చేసింది. పంచాయతీల్లో పాయింట్ ఆఫ్ స్కేల్, పరికరాలు సిద్ధం చేస్తున్నారు. వీటిలో డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లించవచ్చు. క్యూఆర్ కోడ్ కూడా అందుబాటులోకి రానుంది. ప్రజల నుంచి వసూలైన మొత్తాలు పంచాయతీల ఖాతాల్లోకి జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఆన్‌లైన్ విధానంలో ఇలా..

పంచాయతీల ద్వారా జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను మాన్యువల్ పద్ధతిలో జారీచేస్తున్నారు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే అందులో నమోదు చేసిన ఫోన్ నంబరుకు దరఖాస్తు సంఖ్య మెసేజ్ రూపంలో వస్తుంది. ప్రక్రియ పూర్తికాగానే దరఖాస్తుదారుడు ఫోన్ నంబరుకు మెసేజ్ రూపంలో సమాచారం అందుతుంది. కొత్త విధానం అమలులోకి రావడంతో పంచాయతీ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే సర్టిఫికెట్లు పొందవచ్చు.

స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో...

ఇప్పటి వరకు పంచాయతీకి పన్నులు చెల్లించాలంటే సిబ్బంది ఇంటివద్దకు వచ్చేవారు. ప్రజలకే కార్యాలయాలకు వెళ్లేవారు. ఇకపై దేశంలో ఏ మూలనుంచైనా గ్రామంలోని ఇంటికి ఏటా ఆస్తిపన్ను చెల్లించవచ్చు. నేరుగా ఆన్‌లైన్‌లో ఆస్తిపన్ను వివరాలు తెలుసుకోవచ్చు. ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన స్వర్ణ పంచాయతీలో డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ట్రేడ్ లైసెన్స్, భవన నిర్మాణ అనుమతులు, వివాహ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతోపాటు ఇతర ఏ సేవలైనా ఆన్‌లైన్‌లో పొందవచ్చు.

మొదటి విడతలో...

పంచాయతీల్లో మొదటి విడతలో ముఖ్యమైన సేవలు ఆన్‌లైన్‌లో పొందవచ్చు. ముఖ్యంగా ఆస్తి విలువ, ధ్రువీకరణ పత్రాలు, వ్యాపార లైసెన్స్‌లు జారీ అయ్యేలా చూస్తారు. జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు ఎన్ఓసీ, భవన నిర్మాణ అనుమతులు ఆన్‌లైన్‌లో ఇవ్వనున్నారు. పంచాయతీల్లో అందించే 80 రకాల సేవలను క్రమేపీ స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో నమోదు చేయనున్నారు. దీంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే చాలు సేవలు పొందవచ్చు.

93 శాతం పూర్తి

జిల్లాలోని 33 పంచాయతీల్లో 467గ్రా పంచాయతీల పరిధిలో వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే 96శాతం పూర్తయినట్లు తెలుస్తోంది. పంచాయతీ కార్యదర్శులు డిజిటల్ సంతకాలను బయోమెట్రిక్ నమోదు చేస్తారు. ప్రతి ఇంటి నుంచి అన్ని వి వరాలను సేకరించి, సమగ్రంగా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో పొందుపరుస్తారు. వీటిని స్వర్ణపంచాయతీ పోర్టల్‌లో అందుబాటులోకి తెస్తారు. ఆ దిశగా జిల్లా యంత్రాంగం పనిచేస్తుంది.

తొలి గెలుపు

గుంతకల్లు రైల్వే డివిజన్‌లో ఎంప్లాయీస్ సంఘ్ విజయం

గుంతకల్లు, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగ సంఘ గుర్తింపు ఎన్నికల్లో ఎంప్లాయీస్ సంఘ్ గుంతకల్లు రైల్వే డివిజన్‌లో తొలిసారి గెలుపు సాధించింది. దేశవ్యాప్తంగా నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్ (ఎన్ఎఫ్ఐఆర్) గతంలో కంటే మెరుగైన విజయాలను నమోదుచేసింది. ఎన్ఎఫ్ఐఆర్‌కు అనుబంధంగా ఉన్న ఎంప్లాయీస్ సంఘ్ దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో ఆరుచోట్ల ఆధిపత్యం సాధించింది. దేశవ్యాప్తంగా జరిగిన ఈ ఎన్నికల్లో ఎన్ఎఫ్ఐఆర్, ఏఐఆర్ఎఫ్ ఉద్యోగ సమాఖ్యలు దాదాపు సమాన ఆధిపత్యాలను ప్రదర్శించాయి.

తక్కువ చోట్ల గెలిచినా యూనియన్ ఆధిక్యం

ఈ రైల్వే ఎన్నికల్లో ఎంప్లాయీస్ సంఘ్ ఎక్కువ చోట్ల గెలుపొందినా, మజ్దూర్ యూనియన్ జోన్ స్థాయిలో ఆధిక్యం కనబరిచింది. ఇప్పటిదాకా 2007, 2013 సంవత్సరాల్లో రైల్వే ఉద్యోగ సంఘ గుర్తింపు కోసం ఎన్నికలు జరిగాయి. తర్వాత 2018లో ఎన్నికలు జరగాల్సి ఉండగా వాయిదాపడి ఈ నెలలో జరిగాయి. 2007, 2013 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ మొదటి స్థానంలో నిలిచింది. ఆ రెండుసార్లూ సంఘ్ రెండో స్థానంతో సరిపెట్టుకుంది. ఇప్పుడు జోనల్ వ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో గుంతకల్లు, నాందేడ్, గుంటూరు, హైదరాబాదు, సీఆర్ఎస్ తిరుపతి, లల్లాగూడ వర్క్‌షాపు ఎన్నికల్లో ఎంప్లాయీస్ సంఘ్ ఎక్కువ ఓట్లను సాధించగా, యూనియన్ రెండో స్థానంతో సరిపెట్టుకుంది. అలాగే జోన్ పరిధిలోని సికింద్రాబాద్, రైల్ నిలయం, విజయవాడ, రాయంపాడు స్టేషన్‌లో జరిగిన ఎన్నికల్లో సంఘ్‌పై యూనియన్ మెజారిటీని సాధించింది. మొత్తానికి సంఘ్ ఆరుచోట్ల గెలుపొందినా, నాలుగు చోట్ల విజయం సాధించిన మజ్దూర్ యూనియన్ 3,087 ఓట్లతో జోన్‌లో ఆధిపత్యాన్ని సాధించింది.

ఎన్నికల్లో చెరి సగం

జాతీయ స్థాయిలో జరిగిన రైల్వే ఉద్యోగ సంఘ గుర్తింపు ఎన్నికల్లో ఆలిండియా రైల్వేమెన్ ఫెడరేషన్ (ఏఐఆర్ఎఫ్), నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్ (ఎన్ఎఫ్ఐఆర్) ఉద్యోగ సంఘ సమాఖ్యలు దాదాపు సమాన స్థాయిలో నిలిచాయి. ఈ రెండు ఉద్యోగ సమాఖ్యలకు అనుబంధంగా వివిధ డివిజన్లలో వివిధ పేర్లతో ఉన్న ఉద్యోగ సంఘాలు ఈ ఎన్నికల్లో పోటీపడ్డాయి. ఈ ఎన్నికల్లో మొత్తం ఓట్లలో 30 శాతం ఓట్లను సాధించిన సంఘాన్ని యాజమాన్యం గుర్తిస్తుంది. రెండు సంఘాలు 30 శాతాన్ని దాటి ఓట్లను సాధిస్తే రెండింటికీ యాజమాన్యం గుర్తింపును ఇస్తుంది. 30 శాతం ఓట్లు దాటినా ఎక్కువ ఓట్లను సాధించిన ఉద్యోగ సంఘాలు గెలుపు సాధించినట్లుగా భావిస్తాయి. ఈ మేరకు దేశంలో ఉన్న రైల్వే జోన్లు, మెట్రో రైల్వేలు కలిపి మొత్తం 19 చోట్ల జరిగిన ఎన్నికల్లో ఎన్ఎఫ్ఐఆర్ సమాఖ్య ఎనిమిది చోట్ల, ఏఐఆర్ఎఫ్ సమాఖ్య ఏడుచోట్ల తొలి స్థానాన్ని సాధించాయి. అలాగే ఎన్ఎఫ్ఐఆర్ సమాఖ్య 30 శాతం ఓట్లను సాధించినా ఏఐఆర్ఎఫ్ కంటే తక్కువ ఓట్లు రావడంతో ఐదుచోట్ల రెండో స్థానంలో నిలిచింది. ఎన్ఎఫ్ఐఆర్ ఆరుచోట్ల రెండో స్థానంలో నిలిచింది. ఆరు చోట్ల ఈ రెండు సమాఖ్యలకు 30 శాతం కంటే తక్కువ ఓట్లు రావడంతో ఆ చోట్ల ఈ రెండు సమాఖ్యలలో ఉన్న సంఘాలకు గుర్తింపు గల్లంతైంది.



పోరాటాలే గెలిపించాయి: ప్రభాకర్, సంఘ్ డివిజనల్ కార్యదర్శి

మాకు ఓటువేసి తొలిసారిగా పూర్తి ఆధిక్యాన్నిచ్చిన ఉద్యోగ ఓటర్లకు ధన్యవాదాలు తెలుపుతున్నాం. మేము గతంలో చేసిన పోరాటాలలో ఎక్కువ శాతం విజయాన్ని సాధించాము. ఓ రైల్వే ట్రాక్‌మన్ ఆత్మహత్య విషయంగా చేసిన పోరాటాలను గుర్తించి ఉద్యోగులు, కార్మికులు మా సంఘంపై నమ్మకాన్ని ఉంచి ఓట్లు వేశారు. ఇకపై కూడా ఫలప్రద పోరాటాలతో కార్మికులు, ఉద్యోగులకు మేలు చేయడానికి సర్వశక్తులను ఒడ్డుతాం.



నమ్మకాన్ని నిలుపుకుంటాం: మల్లికార్జున, సంఘ్ ఏడీఎస్

మాపై నమ్మకాన్ని ఉంచి ఓట్లు వేసిన ఉద్యోగులు, కార్మికులకు జవాబుదారీగా ఉంటాము. ప్రచారా ఆర్భాటాలు, పొద్దుపుచ్చే కార్యక్రమాలు కాకుండా, ఇబ్బందుల్లో ఉన్న ఉద్యోగులకు మేము అండగా నిలుస్తాం. ఈ ఆధిక్యాన్ని ఇలాగే నిలుపుకోవడానికి ప్రయత్నిస్తాం.

జగన్ హయాంలో రైతులకు అన్యాయం

మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు



మాట్లాడుతున్న ఎంఎస్ రాజు

అనంతపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాలనలో వైఎస్ జగన్ అన్నదాతలకు తీవ్ర అన్యాయం చేశారని మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు ఎంఎస్ రాజు మండిపడ్డారు. నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. హంద్రీనీవాకు ఒక్క పైసా ఖర్చు పెట్టారా అని వైసీపీ నాయకులను నిలదీశారు. అపట్లో తమ నాయకుడు, సీఎం చంద్రబాబు హంద్రీనీవా పథకం కింద 31 పనులను మొదలుపెడితే.. వాటిని రద్దు చేసింది జగన్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లాకు చుక్కనీరు తీసుకురాని వారికి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదని అన్నారు. పెద్దిరెడ్డి పుంగనూరుకు నీరు తీసుకుపోతుంటే నోరు మెదపలేదని మండిపడ్డారు. చంద్రబాబు 90 శాతం రాయితీలతో డ్రిప్ పరికరాలు ఇచ్చారని, జగన్ నిర్వీర్యం చేసిందని అనానరు. ఉద్యాన రైతులకు ఎవరు అండగా ఉన్నారో చర్చకు సిద్ధమా అని వైసీపీ నాయకులకు సవాల్ విసిరారు. ధాన్యం కొనుగోలు చేసి రూ.1600 కోట్లు బకాయిలు పెడితే కూటమి ప్రభుత్వం చెల్లించిందని అన్నారు. జగన్ ప్రభుత్వంలో బతకలేనని పులివెందులలో చీనీ రైతు ఆత్మహత్య చేసుకున్నాడని, వైసీపీ ఐదేళ్ల పాలనలో 3 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. జగన్ తీరు తెలుసుకాబట్టే ధర్నాలకు రైతులు రాలేదని అన్నారు. కాలేజీ విద్యార్థులు, పార్టీ కార్యకర్తలు, నాయకులతో ధర్నా చేయించారని ఎద్దేవా చేశారు. రైతులకు రూ.7500 ఇచ్చి మిగిలిన పథకాలన్నీ రద్దు చేసిన దుర్మార్గుడు జగన్ అని మండిపడ్డారు. శింగనమల నియోజకవర్గంలో వడగండ్ల వానతో 5 వేల ఎకరాల్లో పంటనష్టపోయి రైతులకు రూపాయి కూడా పరిహారం ఇవ్వలేదని విమర్శించారు. అసైన్డ్ భూముల వ్యవహారం, సాగునీటి ప్రాజెక్టులు, మద్యపాన నిషేధం, అమ్మఒడి సహా అన్నింటిపై చర్చకు రావాలని సవాలు విసిరారు.

వైసీపీది దగాకోరుల దండయాత్ర

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



మాట్లాడుతున్న కాలవ

అనంతపురం అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులది ప్రభుత్వంపై దగాకోరుల దండయాత్ర అని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని నాశనం చేశారని, రైతులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే రైతులను దారుణంగా మోసగించారని అన్నారు. 2018లో పంట నష్టపోయిన జిల్లా రైతులకు రూ.930 కోట్లు పరిహారం ఇస్తామని అసెంబ్లీ సాక్షిగా హామి ఇచ్చి, ఎగ్గొట్టిన మోసగాడు జగన్ అని విమర్శించారు. టీడీపీ హయాంలో 2014-19 సంవత్సరాల్లో మూడేళ్ల పరిహారం ఇచ్చామని అన్నారు. ఒకే సంవత్సరంలో రూ.1,471 కోట్ల పరిహారం ఇచ్చామని, ఇందులో కేవలం పంటనష్టపరిహారం రూ.1,032 కోట్లు ఉందని అన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో జిల్లాకు రూ.1,000 కోట్లు సాయం చేయగా, ఇందులో కేవలం రూ.113 కోట్లు పంట నష్టపరిహారం ఉందని, మిగతాదంతా బీమా అని అన్నారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా నిలిపివేసి, జిల్లా భవిష్యత్తును నాశనం చేశారని అన్నారు. టీడీపీ హయాంలో రూ.1000 కోట్లతో హంద్రీనీవా పనులు ప్రారంభించామని, వైసీపీ అధికారంలోకి రాగానే ఆపేశారని విమర్శించారు. రూ.10వేల కోట్లతో అదనంగా 6300 క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచుతానని జగన్ హామీ ఇచ్చి, నెరవేర్చలేదని అన్నారు. గత ఐదేళ్లల్లో మల్యాల - జీడిపల్లి తొలి దశ విస్తరణకు ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదని మండిపడ్డారు. అధికారంలో ఉండగా అన్యాయం చేసి.. ఇప్పుడు రైతుల మీద కపట ప్రేమను చూపిస్తున్నారని విమర్శించారు. వైసీపీ మోసగాళ్లు అందరూ కలెక్టరేట్ వద్ద మొసలికన్నీరు కార్చినట్లు ఉందని ఎద్దేవా చ ఏశారు. కూటమి ప్రభుత్వం నీటి ప్రాజెక్టుల పనులను మళ్లీ ప్రారంభిస్తోందని అన్నారు. రూ.36 కోట్లతో హెచ్చెల్సీ ఆధునికీకరణకు టెండర్లు ఆహ్వానించామని అన్నారు. ఫిబ్రవరిలో పనులు ప్రారంభం అవుతాయని అన్నారు. రైతుల సంక్షేమం కోసం పాటుపడుతున్న చంద్రబాబుతో చేతులు కలపాలని హితవు పలికారు.

రేపు రాయలసీమ మహా కవిసమ్మేళనం

రాయలసీమ సాంస్కృతిక వేదిక కన్వీనర్ డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాయలసీమ మహా కవిసమ్మేళనాన్ని జయప్రదం చేయాలని రాయలసీమ సాంస్కృతిక వేదిక కన్వీనర్ డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 15న స్థానిక ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మహాకవిసమ్మేళనం బ్రోచర్లను శుక్రవారం ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఆడిటోరియంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కవిసమ్మేళనంలో భాగంగా రాయలసీమ చిత్రలేఖనాల ప్రదర్శన, పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాలనుంచి హాజరయ్యే దాదాపు 140 మంది కవులు కవితాగానం చేస్తారన్నారు. కవిసమ్మేళనంలో అన్నివర్గాల ప్రజలు, మేధావులు, కవులు, కళాకారులు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాయలసీమ సాంస్కృతిక వేదిక సభ్యులు రవికుమార్, నాగేశారెడ్డి, వన్నూరుసాబ్, తమ్మారెడ్డి, వన్నూరుస్వామి పాల్గొన్నారు.



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

చిత్తశుద్ధితో పనిచేద్దాం

కలెక్టరేట్‌లో అధికారుల ప్రతిజ్ఞ

అనంతపురంటౌన్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు శుక్రవారం స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంటరీని ఆవిష్కరించారు. ఈకార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో లైవ్ ప్రదర్శించారు. జేసీ శివనారాయణశర్మ ఆధ్వర్యంలో విజన్ స్వర్ణాంధ్ర-విజన్ అభివృద్ధికి ప్రతిఒక్కరు చిత్తశుద్ధితో పనిచేద్దాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీఆర్ఓ మలోల, డీపీఓ నాగరాజునాయుడు, డీఈఓ ప్రసాద్ బాబు, హౌసింగ్ పీడీ శైలజ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్

చీనీ టన్ను రూ.29 వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.29వేలు, కనిష్ఠంగా రూ.6వేలు, సరాసరి రూ.20వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 39 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నీటి నిల్వ 1.667 టీఎంసీలు

బెళుగుప్ప, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో ప్రస్తుత నీటి నిల్వ 1.667 టీఎంసీలు వున్నట్లు శుక్రవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో 793 క్యూసెక్కులు ఉండగా ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 719 క్యూసెక్కులు వెళుతున్నట్లు వెల్లడించారు.

నేడు, రేపు మానవహక్కుల వేదిక రాష్ట్ర మహాసభలు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాలకు సంబంధించి అనంతపురం నగరంలో శని, ఆదివారాల్లో మానవ హక్కుల వేదిక 10వ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యూజీ శ్రీనివాసులు బుధవారం ప్రకటనలో తెలిపారు. 'కులగణన ఎందుకు అవసరం' అనే అంశంపై సామాజిక విశ్లేషకుడు ఎస్ఎన్ సాహూ, 'బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు' అనే అంశంపై జర్నలిస్టు మాలినీ సుబ్రహ్మణ్యం, 'కాషాయీకరణ, కార్పొరేటీకరణ' అంశాలపై చరిత్ర విశ్రాంత అధ్యాపకుడు కొప్పర్తి వెంకటరమణమూర్తి ప్రసంగిస్తారని తెలిపారు. అన్నివర్గాల ప్రముఖులు, ప్రజలు మహాసభల్లో పాల్గొని, విజయవంతం చేయాలని యూజీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు.

క్రైం కార్నర్

హంద్రీనీవా కాలువలో యువకుడి గల్లంతు



ఆదికేశవరెడ్డి (ఫైల్)

గుంతకల్లుటౌన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసాపురం గ్రామ సమీపంలో పెద్దవడుగూరు మండలానికి చెందిన 19ఏళ్ల యువకుడు యు.ఆదికేశవరెడ్డి హంద్రీనీవా కాలువలో గల్లంతయ్యా డు. కసాపురం పోలీసులు తెలిపిన మేరకు పెద్దవడుగూరు గ్రామానికి చెందిన ఆదికేశవరెడ్డి ఐషర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయానికి వెళ్లాడు. ఉదయం కసాపురం గ్రామ సమీపంలో ఉన్న హంద్రీనీవా కాలువలోకి స్నానానికి దిగాడు. నీటిలో మునిగాడు. అయితే ఎంత సేపటికి బయటకు రాకపోవడంతో అక్కడే ఉన్న కొంతమంది మాలధారులు కసాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చేపట్టారు. తండ్రి శ్రీనివాసులరెడ్డి ఫిర్యాదు మేరకు కసాపురం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు

కల్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అనంతపురానికి చెందిన ఓ ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు చిత్తూరు జిల్లా కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతపురం నగరానికి చెందిన ఓ బాలిక(15) చిత్తూరు జిల్లాలో చదువుకుంటోంది. డిసెంబరు 3వ తేదీన కళాశాల వద్దకు వచ్చిన హరికృష్ణ ఆమెను తన వెంట అనంతపురం తీసుకెళ్లాడు.ఓ గుడిలో పెళ్లి చేసుకోవాలని చెప్పగా ఆమె నిరాకరించింది. దీంతో హరికృష్ణ బలాత్కారానికి ప్రయత్నించగా ఆమె తప్పించుకొని తల్లిదండ్రుల వద్దకు చేరుకుంది. ఈ క్రమంలో ఈనెల 10న బాలిక తల్లి కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేశారు. గురువారం సాయంత్రం కల్లూరులో హరికృష్ణను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరు నెలల తర్వాత పోస్టుమార్టం



చరణ్ (ఫైల్)

డీ.హీరేహాళ్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి మృతి చెందిన బాలుడు చరణ్(7) మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. మండలంలోని మల్లికేతి గ్రామానికి చెందిన వెంకప్ప, అంజమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. ఇందులో ఆఖరివాడైన చరణ్ ఆరునెలల కిందట గ్రామ సమీపంలో స్నేహితులతో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు అక్కడ ఉన్న నీటి కుంటలో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మరుసటి రోజే ఆ పిల్లవాడి అంత్యక్రియలు పూర్తి చేశారు. అయితే నెల రోజుల కిందట బాలుడి మృతిపై తమకు అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి శుక్రవారం మల్లికేతి గ్రామానికి చేరుకొని అనంతపురం ఫోరెన్సిక్ వైద్యుల పర్యవేక్షణలో శవాన్ని వెలికి తీయించారు. అనంతరం మృతదేహంలోని భాగాలను అనంతపురం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించారు. ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి వచ్చే నివేదిక మేరకు విచారణ చేపడతామని ఎస్ఐ తెలిపారు.



ఇద్దరు నిందితులు, వాహనాలతో పోలీసులు

నగరంలో చోరీలు
ముగ్గురి అరెస్టు

అనంతపురం క్రైం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు, ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని నాలుగో పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సీఐ కనుమూరి సాయినాథ్ తెలిపిన మేరకు, అనంతపురం మారుతీనగర్ సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న గుజ్జల అశోక్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకుని విచారించారు. ఇతడిని శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని దుర్గానగర్ వాసిగా గుర్తించారు. ధర్మవరంలోని నాలుగబావికి చెందిన ఓ బాలుడితో కలిసి సెప్టెంబరులో అనంతపురం నగరంలోని లక్ష్మీనగర్‌లో ఓ బైక్ దొంగిలించాడు. నవంబరులో లెనిన్‌నగర్‌లో మరో బైక్ చోరీ చేశాడు. వారి నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచారు. చోరీలకు పాల్పడుతున్న ధర్మవరానికి చెందిన గుర్రంపాటి రాకేశ్ రణదీర్‌ను నగరంలోని డీమార్ట్ సమీపంలో ఎస్ఐ అల్లాబకాష్ అరెస్టు చేశారు. అతడి నుంచి ఓ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నరసింహులు అనే పాత నేరస్థుడితో కలిసి మారుతీనగర్‌లోని కోదండ రామాలయంలో హుండీ పగలకొట్టి చోరీ చేశాడు. నరసింహులు పరారీలో ఉన్నాడు. పట్టుబడినవారిలో బాలుడిని జువైనల్ కోర్టులో హాజరుపరిచారు.

ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు

గార్లదిన్నె, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన సుజాత ఆత్మహత్య కేసులో ఆమె భర్త సురేశ్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు. తన ఇద్దరు పిల్లలకు విషపు గుళికలు ఇచ్చి, సుజాత ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. వీరి కుమారుడు నాగచైతన్య మృతిచెందాడు. కూతురు పరిస్థితి విషమంగా ఉంది.
- గార్లదిన్నె మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిపై అత్యాచారం కేసులో నిందితుడు సాకే వంశీని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముగిసిన శిక్షణ

అనంతపురంరూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యాలపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ శుక్రవారం ముగిసింది. స్థానిక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో చివరి రోజు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహణ శక్తి సామర్థ్యాలు, వ్యాపారం చేసుకొనుటకు కావలసిన విధి విధానాలు, వ్యాపార అభివృద్ధి అంశాల గురించి ఐఎల్ఓ శిక్షకులు రాజ్యలక్ష్మి, రామాంజనేయులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ యువతీ, యువకులు, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. ఈనెల 17 నుంచి ఐదు రోజుల పాటు స్టార్ట్ యువర్ బిజినెస్‌పై ఉచిత శిక్షణ ఉంటుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 08554-281026, 8317520929 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు సాగునీటి సంఘాల ఎన్నికలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నిలకు శనివారం పోలింగ్ నిర్వహించనున్నారు. ఎన్నికల పోలింగ్ నిర్వహణకు సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు హెచ్చెల్సీ పరిధిలో 99, మైనర్ ఇరిగేషన్ పరిధిలో 95 మొత్తం 194సాగునీటి సంఘాల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాల పరిధిలోని ఆయా ప్రాజెక్టులు, ఆయా డిస్ట్రిబ్యూటరీల పరిధిలో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 194సాగునీటి సంఘాల ఎన్నిక, సర్వసభ్యసమావేశాలు మొత్తం శనివారమే నిర్వహించనున్నారు. 17న జిల్లాలోని హెచ్ఎల్ఎంసీ, మిడ్ పెన్నార్ సౌత్‌కెనాల్, మిడ్ పెన్నార్ నార్త్ కెనాల్, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్, గుంతకల్లు బ్రాంచ్‌కెనాల్, ఆలూరు బ్రాంచ్ కెనాల్‌తో పాటు డిస్ట్రిబ్యూటరీల కమిటీలను ఎన్నుకుంటారు. అదేరోజు తుంగభద్ర, భైరవానితిప్ప ప్రాజెక్ట్, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల కమిటీలను ఎన్నుకోనున్నారు. ఆయకట్టు రైతులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

అమలుకాని రోడ్డు నియమాలు

పెరుగుతున్న దుర్మరణాలు

హెల్మెట్ ధరించకపోవడమే ప్రధాన కారణం

అవగాహన కల్పించడంలో పోలీసు యంత్రాంగం విఫలం

ధర్మవరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇటీవల రోడ్డు ప్రమాదాలు ఎక్కువయ్యాయి. రోడ్డు నిమయాలు పాటించకపోవడం.. హెల్మెట్ ధరించకపోవడం.. సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపటం.. అతి వేగం... తదితరాల వల్లే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ఈ ప్రమాదంల్లో అనేక మంది మృత్యువాత పడ్డారు. కుటుంబ పెద్ద రోడ్డు ప్రమాదానికి చనిపోవడంతో.. ఆయనపైనే ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు వీధిన పడుతున్నాయి. దీనికంతటికి అసలు కారణం.. వాహనదారులకు రోడ్డు నియమాలపై అవగాహన లేకపోవడమే. అయితే వారికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి.. వాటిని కఠినంగా అమలు చేయడంతో పోలీసు యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. దీనిని కోర్టు కూడా సీరియస్‌గా పరిగణించింది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఇటీవల కాలంలో హెల్మెట్ ధరించడంపై ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు.

● ఐదు నెలల్లో..

ధర్మవరం డివిజన్ పరిధిలోని ఈ ఐదు నెలల్లోనే బైక్ ప్రమాదాల్లో పలువురు మృత్యువాతపడ్డారు. గురువారం పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో నాగమణి అనే మహిళ మృతిచెందింది. ఈనెల 5న మండలంలోని మూడు బావుల క్రాస్ వద్ద గుర్తుతెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో క్రిష్ణారెడ్డి అనే వ్యక్తి మరణించాడు. పట్టణ సమీపంలోని దేవినర్సింగ్ హోం సమీపంలో గజేంద్ర అనే బేల్దారి ద్విచక్రవాహనంలో రోడ్డుక్రాస్ చేస్తున్న సమయంలో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గజేంద్ర అక్కడికక్కడే మృతిచెందాడు. పట్టణంలోని మార్కెట్ యార్డ్ సమీపంలో ఈ ఐదు నెలల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది గాయపడ్డారు.



హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులు



కళాజ్యోతి సర్కిల్‌లో అడ్డదిడ్డంగా వెళ్తున్న ద్విచక్రవాహనదారుడు

న్యూస్ బాక్స్...

పెరిగిన చలి

కొత్తచెరువు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల వరుసగా తుఫానులు రావడంతో ఉష్ణోగ్రతలు తగ్గిపోయాయి. చలిగాలులు ఎక్కువయ్యాయి. తెల్లవారుజామున 8గంటల వరకు చలిగాలులతో పాటు పొగమంచు పడుతుండటంతో జనాలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఈ చలిగాలులకు వణికిపోతున్నారు. అదేవిధంగా మూడు రోజులుగా బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులు పడుతున్నాయి. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడ వర్షం కురిసింది. 24 మండలాల్లో స్వల్పంగా వర్షాలు పడ్డాయని సీపీఓ విజయ్‌కుమార్ తెలిపారు.

వీధిదీపాలు ఏర్పాటు చేయండి

నల్లమాడ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీలోని తిప్పయ్యగారిపల్లిలో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. మూడేళ్ల నుంచి వీధిదీపాలు వెలగడంలేదన్నారు. రాత్రి సమయంలో ఇళ్లలోనుంచి బయటకు రావాలంటేనే పిల్లలు, మహిళలు వృద్ధులు భయపడుతున్నారన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో విషపురుగుల సంచారం అధికంగా ఉందన్నారు. అధికారులు స్పందించి వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

కదిరి అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ట్రైబ్యుల్ వెల్ఫేర్ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శుక్రవారం స్టడీమెటీరియల్‌ను పంపిణీ చేశారు. హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్టు సహకారంతో యూటీఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్ అందించారు. ఈ కార్యక్రమంలో హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు మూడే రవినాయక్, యుటీఎఫ్ శ్రీనివాసులు, మల్లికార్జున, ఆజాంబాషా, మున్సిపల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

రైతు సమస్యలపై వైసీపీ ర్యాలీ



జేసీకి వినతిపత్రం ఇస్తున్న వైసీపీ నాయకులు

పుట్టపర్తిటౌన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలు పరిష్కరించాలని జిల్లా వైసీపీ నాయకులు పుట్టపర్తిలో శుక్రవారం నిరసన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఇందులో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఇంటి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా.. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రైతును దమనీయ పరిస్థితుల్లోకి నెట్టుతోందన్నారు. ఎన్నికల్లో రైతుల ఓటు బ్యాంకు కొల్లగొట్టేందుకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇంత వరకు ఇవ్వలేదు. కార్యక్రమంలో నాయకులు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మగ్బుల్ బాషా, అత్తర్ చాంద్‌బాషా, దీపిక, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కుబడిగా రెవెన్యూ సదస్సు

గాండ్లపెంట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురమామిడిలో అధికారులు రైతులు లేకుండానే శుక్రవారం మొక్కుబడిగా రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఏ గ్రామంలో.. ఏ రోజు ఈ సదస్సు నిర్వహిస్తున్నారో రైతులకు ముందస్తు సమాచారం లేకపోవడంతో వారు ఈ సదస్సులకు రావడం లేదు. రైతులకు సమాచారం ఇవ్వడం అధికారులూ నిర్లక్ష్యం చూపుతున్నారు. దీంతో ఈ సదస్సుల ఉద్దేశం నీరుగారిపోతోంది. కురమామిడిలో నిర్వహించిన సదస్సులో ఆరు ఫిర్యాదులు మాత్రమే వచ్చినట్లు తహసీల్దార్ బాబురావు తెలిపారు.

రస్తా పరిశీలన

ముదిగుబ్బ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నలకొత్తపల్లి, సంకేపల్లి వద్ద గల వివాద రస్తాను ధర్మవరం ఆర్డీఓ మహేశ్ శుక్రవారం పరిశీలించారు. తమకు రస్తా ఇవ్వకుండా కొంతమంది అడ్డపడుతున్నారని జొన్నలకొత్తపల్లి తండా వాసులు ఫిర్యాదు చేశారని, దీంతో ఆ రస్తాను పరిశీలించడానికి వచ్చామని ఆర్డీఓ తెలిపారు. తహసీల్దార్ నారాయణస్వామి, సర్వేల ద్వారా ఇక్కడ స్థలం ప్రభుత్వానిదా లేదా ప్రైవేటు స్థలం అన్న విషయాలను పరిశీలించామన్నారు. దీనిపై పూర్తి దశలో విచారణ చేపట్టి, న్యాయం జరిగే విధంగా చర్యలు చేపడుతామన్నారు.

జాతీయ సదస్సు ప్రారంభం

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): వ్యాపార నిర్వహణలో పురోగతి, సృజనాత్మకతపై జిల్లాకేంద్రం పరిధిలోని సంస్కృతి ఇంజనీరింగ్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో రెండు రోజులపాటు నిర్వహించే జాతీయ సదస్సును శుక్రవారం ప్రారంభించారు. బెంగుళూరు ఇండస్ బిజినెస్ అకాడమీ ప్రొఫెసర్ ప్రశాంత్ కులకర్ణి, ఐఐఎం బెంగుళూర ప్రొఫెసర్ రవికుమార్ మాట్లాడుతూ.. కృషి, ఓర్పు ప్రాముఖ్యతను వివరించారు. ఇందులో ఎస్ఎస్ఎస్ఐహెచ్ఎల్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ ఎన్ శివకుమార్, సంస్కృతి ఇంజనీరింగ్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రిన్సిపల్, డీన్ బాలకోటేశ్వరి, పూణే ఎంఐటీ వరల్డ్‌పీస్ యూనివర్శిటీ ప్రొఫెసర్ రామ్‌చరణ్, అసోసియేట్ ప్రొఫెసర్ ప్రోగ్రాం డైరక్టర్ రాహుల్ విశ్వనాథ్, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న విద్యావేత్తలు

చెత్త సంపద కేంద్రం శుభ్రం

నంబులపూలకుంట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తిమ్మమ్మ మర్రిమాను చెత్త సంపద కేంద్రం మందుబాబులకు అడ్డాగా మారింది. దీనిపై ఓ కథనాన్ని ఆంధ్రజ్యోతి శుక్రవారం ప్రచురించింది. దీనికి స్పందించిన సర్పంచ్ విష్ణుమూర్తి, పంచాయతీ కార్మికులు ఆ చెత్త సంపద కేంద్రాన్ని శుభ్రం చేయించారు.



చెత్త సంపద కేంద్రాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కాలువలో చెత్త తొలగింపు

నల్లమాడ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ ప్రధాన కూడలిలో మురుగు కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయి, నీరు కదలకుండా నిల్వ ఉండటం వల్ల విపరీతంగా దుర్వాసన వస్తోంది. దీనిపై ఆంధ్రజ్యోతి శుక్రవారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన సచివాలయం కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డి పంచాయతీ సిబ్బందితో ఆ కాలువను శుభ్రం చేయించారు.



నల్లమాడలో కాలువను శుభ్రం చేస్తున్న సిబ్బంది

అయ్యప్ప మాలధారులకు భిక్ష

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్ప ఆలయంలో శుక్రవారం 250 మంది అయ్యప్ప మాలధారులకు ట్రాన్స్‌కో ఏఈ రామసూరారెడ్డి భిక్షను ఏర్పాటు చేశారు. మొదట ఆయన సిబ్బందితో కలిసి అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయుల నాయుడు, లైన్‌మ్యాన్లు గంగాధర్, శీనా, రామాంజి పాల్గొన్నారు.



అయ్యప్ప మాలధారులకు భిక్ష వడ్డిస్తున్న ఏఈ

అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవం

ధర్మవరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కండేయ కల్యాణ మండపంలో పద్మశాలీయ కుల పెద్దల సమక్షంలో బహుత్తమ పద్మశాలీయ సంఘం కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పుత్తారుద్రయ్య, ఉపాధ్యక్షుడిగా జింకా నాగభూషణ ఎన్నికయ్యారు. వారు మాట్లాడుతూ.. పద్మశాలీయ కులస్థుల సమస్యల పరిష్కారానికి, మార్కండేయ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పేదలకు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఏటా నిర్వహించే మార్కండేయస్వామి కల్యాణ మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో పోలంకి వెంకటరామయ్య, గుర్రం లక్ష్మీనారాయణ, జింకా గోవిందు, పోలంకి హరి, పురుషోత్తం, కుళ్లాయప్ప, రంగా శ్రీనివాసులు, పడకల భాస్కర్, ఊట్ల నరేంద్ర పాల్గొన్నారు.



పుత్తారుద్రయ్య, జింకా నాగభూషణ



అధ్వానంగా బడన్నపల్లి మట్టిరోడ్డు

ప్రయాణం... నరకం..!

అధ్వానంగా గ్రామీణ రహదారులు

ధర్మవరంరూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ రహదారులు మరీ ఘోరంగా తయారయ్యాయి. ఆ గ్రామాలకు వెళ్లాలంటేనే నరకప్రాయంగా మారింది. మండలంలోని బడన్నపల్లి గ్రామానికి ఉన్న మట్టి రోడ్డు కాస్తా.. గుంతలు.. గుంతలుగా మారింది. ధర్మవరానికి వెళ్లే రహదారి క్రాస్ నుంచి కిలోమీటర్ మేర ఆ మట్టి రోడ్డు ఉంది. ఈ రోడ్డుకు ఆనుకొని కంపచెట్లు విపరీతంగా పెరగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తుమ్మల, తిప్పేపల్లి, సుబ్బరావుపేట గ్రామాలకు వెళ్లే రహదారి పూర్తిగా శిథిలమైంది. ఈ రోడ్డు మొత్తం గుంతలే. పాలకులు, అధికారులు స్పందించి.. గ్రామాలకు రోడ్డు వేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.



మల్లేనిపల్లి-తుమ్మల రహదారి

సమస్యలు పరిష్కరించని

గ్రామసభలెందుకు..?

రెవెన్యూ అధికారులను నిలదీసిన రైతులు

తాడిమర్రి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తాడిమర్రి చెరువులో ఆక్రమణలు తొలగించాలని పలుమార్లు గ్రామసభల్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, సమస్యలు పరిష్కరించనప్పుడు గ్రామ సభలు నిర్వహించడం ఎందుకని రైతులు రెవెన్యూ అధికారులను నిలదీశారు. శుక్రవారం తాడిమర్రిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భాస్కర్‌రెడ్డితో రైతులు మాట్లాడారు. చెరువులో ఆక్రమణలు తొలగించాలని అక్టోబరు 2న జరిగిన గ్రామసభలో మొదటిసారి ఫిర్యాదు చేశామని, నెల రోజులు ఎదురుచూసినా స్పందించకపోవడంతో కలెక్టర్‌కు నవంబరు 4న మళ్లీ ఫిర్యాదు చేశామని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారన్నారు. అయినా స్థానిక రెవెన్యూ అధికారులు స్పందించకపోవడంతో వారం క్రితం రైతుల గోడుపట్టదా.... కలెక్టర్ ఉత్తర్వులు బేఖాతరు అనే పేరుతో ఆంధ్రజ్యోతి ఓ కథనాన్ని ప్రచురించిందన్నారు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు మాత్రమే స్పందించి అక్రమ కనెక్షన్లను తొలగించారన్నారు. అయినా ఫలితం లేకుండాపోయిందని, ఆక్రమణదారులు మరుసటిరోజే మళ్లీ విద్యుత్ తీగలు తగిలించుకున్నారని అన్నారు. దీనికంత మూలకారణం రెవెన్యూ సిబ్బందేనని, చెరువులో పట్టాలున్నాయా.. లేవా.. అనే విషయం తెల్పకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా చెరువు సమస్య పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

త్వరలోనే సర్వే చేయించి ఆక్రమణలను తొలగిస్తామని తహసీల్దార్ చెప్పగా.. మొదటి నుంచీ అదే చెబుతున్నారే తప్ప.. సమస్య పరిష్కరించడం లేదని మళ్లీ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే మళ్లీ కలెక్టర్ వద్దకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో రైతులు శంకర్, వెంకటరాముడు, పక్కీర్‌రెడ్డి, బీజేపీ నాయకులు శ్రీనివాసులు, నాగేశ్ పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై సమీక్ష

ధర్మవరంరూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై ఆర్డీఓ మహేష్ శుక్రవారం తన చాంబర్‌లో డివిజన్ పరిధిలోని ఇరిగేషన్ డీఈ, ఏఈలకు, డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలతో సమీక్ష నిర్వహించారు. అధికారుల సమన్వయంతో ఎన్నికలను విజయవంతంగా జరిగేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ సురేష్‌బాబు, సీఐలు, ఎస్ఐలు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

● పుట్టపర్తిరూరల్: సాగునీటిసంఘాల ఎన్నికలు రాజకీయాలకు అతీతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి శుక్రవారం ఓప్రకటనలో కోరారు. ఈ ఎన్నికల్లో గ్రామాల్లో గొడవలకు పోకుండా.. గ్రామస్థులంతా చర్చించుకుని ఏకగ్రీవం చేసుకునేలా చూడాలన్నారు. బలం లేకపోయినా అనవసరంగా పోటీచేసి గ్రామాల్లో వివాదాలు సృష్టించవద్దన్నారు.

● తనకల్లు: మండలలోని గందోడివారిపల్లిలో పోలింగ్ కేంద్రాలను మైనర్ ఇరిగేషన్ ఎంపీడీఓ, సంబధికారులు శుక్రవారం పరిశీలించారు. మండలంలోని చెన్నరాయస్వామి గుడిప్రాజెక్టు (సీజీపి), మల్లిరెడ్డిపల్లి, చిన్నరామన్నగారిపల్లి, కొక్కంటి పెద్దచెరువు, తిమ్మనాయునిచెరువుల సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు జరగనున్నాయి. కారక్రమంలో మైనర్ ఇరిగేషన్ అధికారి బయ్యప్ప, ఎంపీడీఓ రెడ్డెప్ప, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

● కదిరి అర్బన్: కదిరి డివిజన్‌లో శనివారం జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇరిగేషన్ డీఈఈ గంగాద్రి తెలిపారు. ఇరిగేషన్ డీఈఈ, ఆర్డీఓ ఎన్నికల పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారన్నారు.

●తనకల్లు: మండలంలోని గందోడివారిపల్లి, మల్లిరెడ్డిపల్లి, చిన్నరామన్నగారిపల్లి, చెక్కవారిపల్లి, కొక్కంటి గ్రామాల్లో శనివారం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నామని, ఎన్నికల నియమాలను అతిక్రమిస్తే కేసులు తప్పవని ఎస్ఐ గోపి హెచ్చరించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు రైతులు సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో హనుమద్ వ్రతం

ధర్మవరం రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మార్గశిర శుద్ధ త్రయోదశిని పురస్కరించుకుని మండలంలోని గొట్లూరు శ్రీఆంజ నేయ స్వామి దేవాలయంలో శుక్రవారం హనుమద్ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌ను వివిధ రకాల పూలతో, తులసిమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామానికి చెందిన అంజనేయస్వామి మాలధారులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం పెద్దఎత్తున భక్తులకు అన్నసంతర్పణ చేశారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు.



గొట్లూరు ఆంజనేయస్వామి

సమస్య పరిష్కరించండి

ధర్మవరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తమ సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని డాక్యుమెంటరీ రైటర్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... గతంలో తాము గాంధీనగర్‌లో సబ్ రిజిస్టర్ కార్యాలయం ఉన్నప్పుడు ప్రైవేటుగా రూంలను అద్దెకు తీసుకొని.. దస్తావేజులు రానుకుంటూ ఉపాధి పొందేవాళ్లమన్నారు. అయితే కూరగాయల మార్కెట్‌లోకి సబ్‌రిజిస్టర్ కార్యాలయాన్ని మార్చడంతో.. తాము కూడా అక్కడికే వచ్చి మున్సిపల్ కాంప్లెక్స్‌కు రూ.9.50 లక్ష గుడ్‌విల్ చెల్లించడంతోపాటు ప్రతినెల రూ.10వేలు బాడుగ చెల్లించాలని మున్సిపల్ అధికారులు, సిబ్బంది డిమాండ్ చేస్తున్నారన్నారు. దీంతో తాము అంత బాడుగ కట్టలేమని, వాటిని తగ్గించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మల్లికార్జున, రామాంజి, గోపి, బాలాజీ, మహేంద్ర, వెంకటేశ్, బాస్కర్, పవన్, అనిల్, కీర్తి, వాజిద్ ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

ఎన్నీకుంట ఇందిరాకాలనీ పాఠశాల వద్ద బావి.. పలుమార్లు ఫిర్యాదు చేసినా తీరని సమస్య



పాఠశాల సమీపంలోని బావి, స్కూల్ నిర్వహిస్తున్న కమ్యూనిటీ భవనం (ఇన్‌సెట్)

నంబులపూలకుంట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరా కాలనీలోని మండల పరిషత్ పాఠశాల సమీపంలోనే బావి రూపంలో ప్రమాదం పొంచి ఉంది. ఈ పాఠశాలకు సొంత భవనం లేదు. ఈ కాలనీకి దాదాపు పదేళ్ల క్రితం ఈ పాఠశాలను మంజూరు చేశారు. అయితే భవనం లేనపోవడంతో అదే కాలనీలో ఆర్డీటీ నిర్మించిన కమ్యూనిటీ భవనంలో ఆ పాఠశాలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆ పాఠశాలలో 25 మంది విద్యార్థులు ఉండగా.. ఇద్దరు ఉపాధ్యాయు లు విధులు నిర్వహిస్తున్నారు. కాగా, ఆ భవనం సమీపంలో ఓ బావి ఉంది. ఆ పాఠశాలకు వచ్చే పిల్లలందరూ ఆ బావి సమీపంలోనే ఆడుకొంటూ ఉంటారు. పిల్లలు ఆ బావిలో పడే ప్రమాదముందని.. తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో పాఠశాలకు స్థలం కేటాయించి.. భవనాన్ని నిర్మించి ఇవ్వాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆ కాలనీ వాపోతున్నారు.

పలుమార్లు వినతులిచ్చాం



గ్రామానికి వచ్చిన ప్రతిసారి రెవెన్యూ అధికారులకు పాఠశాలకు స్థలం కేటాయించాలని విన్నవించాం. అయి నా అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం ఆర్డీటీ భవనం లోనే పాఠ శాల కొనసాగు తోంది. ఈ భవనం సమీపంలోన నీటి బావి ఉంది. పిల్ల లు అందులో పొరబా టున పడితే ప్రాణాలకే ముప్పు. కనీసం ఆ బావిని పూడ్చేలా అయినా చర్యలు తీసుకోవాలి.

- మహేష్, ఇందిరాకాలనీ

క్లుప్తంగా..

గ్రామ సచివాలయం ప్రారంభం



సచివాలయ భవనాలను ప్రారంభిస్తున్న గుండుమల

మడకశిర రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి):మండలంలోని భక్తరహళ్ళి గ్రామంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే రాజుతో కలిసి గుండుమల తిప్పేస్వామి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు మెరుగైన సత్వర సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

లేపాక్షి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 17నుంచి 20వరకు మండలంలోని పులమతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొబైల్ ఆధార్ సేవలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. లేపాక్షి మండలంలో 2016లో జరిగిన ఆధార్ ఎన్రోల్‌మెంట్ చాలా వరకు అడ్రస్‌ప్రూఫ్ లేకుండా జరిగిందన్నారు ఆధార్ అప్‌డేట్ చేసుకోనివారికి మొబైల్ ఆధార్‌సేవలు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఈనెల 3వవారంలో ఈసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఆపార్ ఎన్రోల్‌మెంట్ కోసం ఈ సేవలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అలాంటివారు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉత్సవ విగ్రహాలకు విరాళం

పరిగి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన గ్రామదేవత మారెమ్మ లక్ష్మీనర సింహస్వామి ఉత్సవ విగ్రహాలకు శుక్రవారం బీజేపీ మండల కన్వీనర్ బంగారుచంద్ర రూ.10వేలు విరాళం అందజేశారు. అనంతరం మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో మాలాధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి నరసింహప్ప, లింగారెడ్డి, జగదీశ్, కన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు ముమ్మరం చేయండి



చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్

చిలమత్తూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : కొడికొండ చెక్‌పోస్టులో తనిఖీలు ముమ్మరం చేయాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమీషనర్ నాగముద్దయ్య అధికారులకు సూచించారు. ఆయనతో పాటు అసిస్టెంట్ కమీషనర్ మునిస్వామి, జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరిండెంట్ గోవిందనాయక్‌లు శుక్రవారం చెక్‌పోస్టు కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ సీసీ కెమెరాలు సరిగా పనిచేయకపోవడాన్ని గుర్తించి వాటిని బాగుచేయించాలని ఆదేశించారు. ప్రధానంగా కర్ణాటక నుంచి అక్రమంగా వచ్చే మద్యంతో పాటు నిషేధిత పదార్థాలు గంజాయి, గుట్కా వంటివాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనునిత్యం వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. కర్ణాటక మద్యం రాష్ట్రంలోకి రాకుండా పకడ్బందీగా అడ్డుకోవాలన్నారు. వారి వెంట ఎక్సైజ్ సీఐ రామ్మోహన్ ఉన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూసమస్యల పరిష్కారం

చిలమత్తూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో భూసమస్యలు పూర్తిగా పరిష్కారమవుతాయని రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్ పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దార్ యునసబాబు ఆధ్వర్యంలో కోడూరులో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇష్టానుసారంగా చేపట్టిన పనులతో ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రధానంగా భూసమస్యలు పేరుకుపోయాయన్నారు.

ఉత్తమ బోధనతోనే విద్యార్థుల అభివృద్ధి



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకురాలు కల్పన

హిందూపురం అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు అభివృద్ధి చెందాలన్నా, కార్పొరేట్ విద్యా సంస్థలలో చదువుతున్న విద్యార్థులతో పోటీ పడాలన్నా అందుకు ఉపాధ్యాయులు బోధించే విధానమే కీలకం అని ఎఫ్ఎల్ఎన్ రాష్ట్ర పరిశీలకురాలు కల్పన పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బిట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయులకు నాలుగవ స్పెల్ శిక్షణా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరైనారు. ఏ విద్యా సంస్థలో అయినా విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలు చేరాలంటే అందుకు ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధ్యాయులే కీలకమన్నారు. అందుకే విద్యార్థుల దృష్టిలో ఉపాధ్యాయులు రియల్ హీరోలు అన్నారు. నైతిక విలువలు పెంపొందేలా క్రమశిక్షణ నేర్పించాలన్నారు. అదే విధంగా మంచి భాషను నేర్పించాలన్నారు. గణితంలో చతుర్విధ ప్రక్రియలు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు గంగప్ప, ఆంజనేయులు నాయక్, శేషాచలం, ఆర్పీలు రాజు, అశ్వర్థప్ప, శివయ్య తదితరులు హాజరయ్యారు.

రైతులతో సమీక్ష

పెనుకొండ రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : చెరువుల సాగునీటి సంఘం ఎన్నికలపై టీడీపీ నాయకులు రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని మడకశిర రహదారిలో టీడీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ శ్రీరాములు ఆధ్వర్యంలో ముత్యాల చెరువుకు సంబంధించి 400మంది రైతులతో సాగునీటి సంఘం ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అందులో ఆరుగురు రైతులను ఎంపిక చేశారు. కోనాపురంలో మాదినేని చలపతి, వెంకటరెడ్డిపల్లిలో రామాంజినేయులు, కిష్టప్ప, తిమ్మాపురంలో రామాంజినేయులు, ఇస్లాపురం కె. నారాయణప్ప, కొండాపురంలో రామాంజినేయులు అనే రైతు డైరెక్టర్లుగా ఉండేందుకు ఎన్నుకున్నారు..

మడకశిరలో చోరీలు
మత్తు వీడని పోలీసులు

- దొంగల బెడద పెరగడంతో పట్టణ ప్రజల ఆందోళన
- పోలీసుల కొరతే కారణమంటున్న అధికారులు



చోరీకి గురైన దుకాణం(ఫైల్)



మడకశిర పోలీసు సర్కిల్ కార్యాలయం

మడకశిరటౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయి. ఈ మండలాలలోనే గాకుండా ఇటీవల మడకశిర పట్టణంలో వరుస దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దేవాలయాలను సైతం దొంగలు లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారు. 20 రోజుల క్రితం మారుతీనగర్‌లోని అభయ ఆంజనేయస్వామి ఆలయంలో హుండీని ఎత్తుకెళ్లి గ్రామ సమీపంలో హుండీని పగులగొట్టి డబ్బులు తీసుకొని దానిని అక్కడే పారవేసి వెళ్లారు. దీంతోపాటు మధుగిరి రోడ్డులో ప్రధాన రహదారి పక్కనే ఉన్న హార్డ్‌వేర్‌షాపులు, బేకరీలు లక్ష్యంగా చేసుకొని రాత్రి వేళల్లో దొంగలు చోరీలకు తెగబడుతున్నారు. దీంతో ఏరోజు పట్టణంలో దొంగతనం జరుగుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. మూడు రోజుల క్రితం పట్టణంలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న మూడు మెడికల్‌షాపులు, బేకరీ, కిరాణా దుకాణాల్లో చోరీలకు పాల్పడ్డారు. దీంతో పట్టణ వాసులు మరింత ఆందోళనకు గురవుతున్నారు. అంతేకాక ఇటీవల మారుతీనగర్‌లో ఉద్యోగుల ఇళ్లు లక్ష్యంగా చేసుకొని వారు సెలవుల్లో ఊళ్లకు వెళ్లిన విషయాన్ని గుర్తించిన దొంగలు వారి ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. అయినా ఇంతవరకు పోలీసులు వారిని పట్టుకోలేకపోయారు.

మత్తుపదార్థాల వాడకంపై కనిపించని నిఘా

మడకశిర పట్టణంలో ఇటీవల మత్తుపదార్థాలు వాడేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అందుకు ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు ఉదాహరణగా పట్టణ వాసులు చెబుతున్నారు. పట్టణంలో ప్రధానంగా అంబేడ్కర్ సర్కిల్, శంకరప్పబావి సర్కిల్, నగర పంచాయతీ సమీపంలో ఇలాంటి వాటి కోసం కొందరు సమావేశమవుతున్నట్లు చర్చ సాగుతోంది. అసాంఘిక కార్యకలాపాలు పెరగడం వల్లే దొంగతనాలు సైతం పెరుగుతున్నాయని పట్టణ వాసులు అంటున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల కొంత వరకు వీటిని నియంత్రించవచ్చని పేర్కొంటున్నారు. గా నియోజకవర్గంలో ఐదు మండలాల పరిధిలో సిబ్బంది కొరత వల్ల అసాంఘిక కార్యకలాపాలు అరికట్టడంలో పోలీసులు కొంత వెనకబడ్డారన్న వాదన వినిపిస్తోంది. నియోజకవర్గం వ్యాప్తంగా ఐదు స్టేషన్ల పరిధిలో దాదాపు 30 మంది వరకు సిబ్బంది కొరత ఉన్నట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. అయితే వివరాలను చెప్పేందుకు విముఖత చూపుతున్నారు.

దొంగతనాలు అరికట్టేందుకు చర్యలు



మడకశిర పట్టణంలో దొంగతనాలు అరికట్టేందుకు పట్టణ వాసులు, ప్రజా ప్రతినిధులతో చర్చించాం. అవసరమైన చర్యలు చేపడుతున్నాం. సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు గట్టి నిఘాఉంచి దొంగతనాలను అరికడతాం.

- డీఎస్పీ వెంకటేశులు

శ్రీరామ దూతం శిరసా నమామి



అగళిలో..

ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. అగళి మండలం రామాపురంలో ప్రసన్న వీరాంజనేయస్వామికి, పావగడ తాలూకా పరిధిలోని పెద్దపల్లి, పళవళ్లి కట్ట, పావగడ కోటె, గుడ్లపల్లి పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయాల్లో ఆకు పూజ చేశారు. మడకశిరలోని మిట్టబండ ఆంజనేయస్వామి దేవాలయంలో అమరాపురం తమ్మడేపల్లిలో, గుడిబండ కొంకల్లులలో అర్చనలు నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



పావగడలో..



మడకశిరలో..

పంచాయతీ ఆదాయాన్ని పెంచుకోవాలి



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ సమత

చిలమత్తూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఆదాయ వనరులను సమకూర్చుకోవాలని డీపీఓ సమత పేర్కొన్నారు. ఆమె శుక్రవారం కోడూరు పంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మురళీ మోహన్‌తో గ్రామ అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ప్రభుత్వం మం జూరు చేసిన 15వ ఆర్థిక సంవత్సరం నిధులను దుర్వినియోగం చేసుకోకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అదేవిధంగా పంచాయతీకి ఆదాయ వనరులను వృద్ధి చేసుకోవాలన్నారు. కేవలం ప్రభుత్వం ఇచ్చే నిధులపైనే ఆధారపడకుండా తమవంతుగా సొంతంగా పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలన్నారు. అనంతరం ఆమె చెత్తతో సంపద కేంద్రాన్ని పరిశీలించారు. తడి, పొడి చెత్తతో వానపాముల పెంపకం చేపట్టి పంచాయతీకి ఆదాయాన్ని తీసుకువస్తున్న తీరుపై సర్పంచ్ మురళిని అభినందించారు. పారిశుధ్య కార్మికులకు ఎప్పటికప్పుడు వేతనాలు అందించాలన్నారు. అనంతరం కార్యదర్శులతో సమావేశమయ్యారు.

ఉరుసుకు భారీ బందోబస్తు

పెనుకొండ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : పెనుకొండ బాబయ్యస్వామి ఉరుసు సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటుచేసినట్లు సీఐ రాఘవన్ తెలిపారు. పదిరోజులపాటు జరిగే ఈ ఉరుసు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జరిగే గంధంపూజ మహోత్సవానికి దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు హాజరవుతారు. అనేక మంది ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావడాన్ని దృష్టిలో ఉంచుకుని భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒక డీఎస్పీ, ఐదుగురు సీఐలు, 18మంది ఎస్ఐలు, 600మంది కానిస్టేబుళ్లు, 25మంది మహిళా కానిస్టేబుళ్లు, హైవేమొబైల్ పార్టీ, క్రైమ్‌పార్టీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వడ్డెర సంఘం నాయకుల ఆరోపణలు అవాస్తవం

పెనుకొండ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : రొద్దం మండలం ఆర్.ఎల్. కొత్తూరు గ్రామంలో తాను ఎవరి భూమిని ఆక్రమించుకోలేదని చట్టపరంగా కొనుగోలు చేశానని ఆర్. లోచర్ల మాజీ సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను వడ్డెర్లకు చెందిన భూమిని ఆక్రమించుకున్నానని వారు భూమిలోకి వస్తే తాను బెదిరించి భయపెడుతున్నాననంటూ వడ్డె నాగరాజు, గంగన్న, హనుమంతప్పతోపాటు వడ్డెర సంఘం నాయకులు తనపై లేనిపోని ఆరోపణలు చేశారన్నారు. తాను వడ్డెర్ల భూమిని ఆక్రమించుకోలేదని, గ్రామంలోని భూ యజమానుల నుంచి 63ఎకరాలు చట్టబద్ధంగా కొనుగోలుచేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. తాను కొన్న భూమిలో వడ్డెర్లకు చెందిన భూమి కూడా ఉన్నదని వారు చెబుతున్నారని అలాంటప్పుడు తనకు భూమిని అమ్మిన యజమానులను అడగాలని, లేదా పట్టాపొరాలుంటే కోర్టుకు వెళ్లాలన్నారు.

క్రైం కార్నర్

ఉరివేసుకుని డ్రైవర్ ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న శ్రీనివాసులు

పెనుకొండ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కుమార్తె ఇంటి నుంచి వెళ్లిపోయిందనే మనస్తాపంతో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఆమె తండ్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీలో నివాసముంటున్న వ్యాన్ డ్రైవర్ శ్రీనివాసులు(49) భవన నిర్మాణదారులకు సిమెంటును తరలించి వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో ఏడాదిక్రితం శ్రీనివాసులు చిన్న కుమార్తె ఇటీవల ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి దిగాలుగా ఉంటూ జీవితంపై విరక్తిచెంది మనస్థాపానికి గురై శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో లుంగీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పని నిమిత్తం బయటికి వెళ్లిన భార్య శ్యామల ఇంటికి వచ్చి చూసేసరికి భర్త ఉరికి వేలాడుతూ కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు.

నేడు జాతీయ మెగా లోక్ అదాలత్

పెనుకొండ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు అదాలత్ ఛైర్మన్ సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవన్ తెలిపారు. ఈ అదాలత్‌లో రాజీకాదగ్గ కేసులు, క్రిమినల్, సివిల్ కేసులు, మెయింటెనెన్స్ కేసులు, ఎక్సైజ్ కేసులు, ప్రీలిటిగేషన్, బ్యాంక్ తదితర వాటిని రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ టోర్నమెంట్‌ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం, డిశంబరు 13(ఆంధ్రజ్యోతి):క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఎంజీఎం క్రీడా మైదానంలో శుక్రవారం నందమూరి తారక రత్న మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డా. సురేంద్ర మాట్లాడుతూ యువతకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయన్నారు. ఈ పోటీలో విజేతగా నిలిచిన జట్టుకి రూ.లక్ష, రన్నర్‌కి రూ.50 వేలు, మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్, బెస్ట్ బ్యాట్‌మాన్, ఫీల్డర్‌తో పాటు పాల్గొన్న వారికి రూ.5 వేలు చొప్పున అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ అనిల్ కుమార్, కౌన్సిలర్ రమేష్, నాయకులు ప్రెస్ వెంకటేష్, ఎమ్మెల్యే పీఏ బాలాజీ, అమీన్, నాయుడు, అభి తదితరులు పాల్గొన్నారు.

నూతన గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఏపీఆర్ఈఐ సొసైటీ కార్యదర్శి

పరిగి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కొడిగెనహళ్లి గురుకుల పాఠశాలలో సొసైటీ కార్యదర్శి ఏపీఆర్ఈఐ సొసైటీ కార్యదర్శి వీఎన్ మస్తానయ్య శుక్రవారం నూతన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల డార్మెంటరీ, భోజనశాల, తరగతి గదులు, ఆటస్థలం, క్వార్టర్స్, పీఎన్‌సీ నిర్మాణ పనులుచూసి ప్రిన్సిపాల్ మురళిధర్‌బాబుకు సూచించారు. నిలిచిపోయిన డార్మెంటరీ, అదనపు డైనింగ్‌హాల్, ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణ పనుల గురించి ప్రిన్సిపాల్‌ను ఆరాతీశారు. గత యేడాది విద్యార్థులు సాధించిన ఫలితాలు పరిశీలించి ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష డీఈ చిదంబరం, ఎంఈఓ లక్ష్మీదేవి, శేషాచలం, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో హెచ్‌ఎంకు గాయాలు



గాయపడిన ఉపాధ్యాయుడు

రొళ్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రొళ్ల మండల పరిధిలోని హెచ్.టి.హళ్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకటరామిరెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆయన తనవిధులు ముగించుకొని రెండు సెలవు కావడంతో తన స్వగ్రామమైన చెన్నేకొత్తపల్లికి బయలుదేరి వెళుతుండగా మార్గమధ్యంలో హొట్టేబెట్ట సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వెంటనే స్థానిక ప్రజలు ఆయనను మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం.. వ్యక్తి అరెస్టు

గుడిబండ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంకల్లు గ్రామానికి చెందిన నాగభూషణం అనే వ్యక్తి వద్ద 30 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని అతడిని అరెస్టుచేసినట్లు ఎస్ఐ రాజకుళ్లాయప్ప తెలిపారు. మద్యం ప్యాకెట్లు విక్రయిస్తున్నాడనే సమాచారాన్ని తెలుసుకొని సిబ్బందితో వెళ్లి సోదాచేయగా కర్ణాటక మద్యం ప్యాకెట్లు లభించాయని, దీంతో అతడిని అరెసు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం స్టాక్ పాయింట్ కోసం స్థల పరిశీలన



మల్లాపల్లి వద్ద ప్రభుత్వ స్థలంపై చర్చిస్తున్న అధికారులు

గోరంట్ల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లాల్లోని మద్యం దుకాణాలకు అందుబాటులో ఉండేలా స్టాక్‌పాయింట్ కోసం రెవిన్యూ, ఎక్సైజ్ ఉన్నతాధికారులు గోరంట్ల మండలంలో శుక్రవారం స్థల పరిశీలన చేశారు. మండలంలోని పాలసముద్రం జాతీయ రహదారి సమీపంలోని సామలపల్లి క్రాస్ వద్ద, మల్లాపల్లి ప్రభుత్వ లేఅవుట్ పక్కన, సర్వే నెంబర్ 307లోని ప్రభుత్వ భూమిని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, అనంతపురం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య పరిశీలించారు. అనంతపురం మద్యం డిపోనుంచి సత్యసాయి జిల్లాకు వంద కిలోమీటర్లపైబడి మద్యాన్ని రవాణా చేయాల్సి వస్తోంది. దీంతో జిల్లాలోని మద్యం దుకాణాలకు అనుకూలంగా ఉండేలా గోరంట్ల మండలంలోని రెండు ఎకరాల ప్రభుత్వ స్థలంకోసం అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి, స్టాక్‌పాయింట్ డిపో నిర్మాణం కోసం గోడౌన్ నిర్మించనున్నారు. అప్పటివరకు పాలసముద్రం జాతీయ రహదారి కూడలికి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓగౌడౌన్‌లో తాత్కాలికంగా మద్యం ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో అధికారులున్నట్లు తెలిసింది. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, సత్యసాయి జిల్లా ఎక్సైజ్ అధికారి గోవిందునాయక్, ఎఈఎస్ నరసింహులు, తహసీల్దార్ మారుతి, పెనుకొండ ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబ్, ఎస్ఐ విజీ రాముడు, ఆర్ఐ సోముశేఖర్‌రెడ్డి, విఆర్ఓ పవన్‌కుమార్ తదితరులున్నారు.

మాలమహానాడు ప్రధాన కార్యదర్శికి అభినందన

గుడిబండ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుడిబండ మండలం మాలమహానాడు సంఘం నూతన కమిటీ మండల ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన గోవిందరాజును టీడీపీ నాయకులు మాజీ సర్పంచి శ్రీనాథ్, జయరాంలు అభినందించారు అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

నేడు శనైశ్చరుడి ఆలయంలో దత్తాత్రేయ జయంతి

పావగడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చరిత్ర ప్రసిద్ధి గాంచిన పావగడ శనైశ్చర ఆలయంలో దత్తాత్రేయ జయంతి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణశాస్త్రి తెలియజేశారు.

బస్ షెల్టర్ కాదు.. మందుబాబులకు అడ్డా



నిరుపయోగంగా మారిన బస్ షెల్టర్

సోమందేపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇది పేరుకే బస్ షెల్టర్. అయితే చాలాకాలంగా ప్రజలు ఉపయోగించుకోకుండా వదిలేయడంతో అది మందుబాబులకు అడ్డాగా మారింది. మండల పరిధిలోని పత్తికుంటపల్లి గ్రామంలోని బస్‌షెల్టర్‌లో రాత్రి వేళల్లో మందుబాబులు మద్యం తాగి, మందుబాటిళ్లు, డిస్పోజల్, చెత్తాచెదారాన్ని అక్కడే వదిలి వెళ్తున్నారు. దీంతో స్థానికులు బస్‌షెల్టర్‌ను ఉపయోగించుకోవడం మానేశారు. వీరి ఆగడాలను కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వంటగది నిర్మాణానికి ముందుకొచ్చిన స్లాప్ కంపెనీ



సమావేశంలో ప్రసంగిస్తున్న స్లాప్ ఎండీ

సోమందేపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో వంటగది లేకపోవడంతో ఏజెన్సీ నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. సోషల్ మీడియాలో గురువారం వైరల్ అయిన ఈ కథనానికి స్లాప్ ఎండీ మిన్‌షియుకిమ్ స్పందించి శుక్రవారం పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం అమలవుతున్న వంటగది లేకపోవడంతో ఏజెన్సీ నిర్వాహకులు ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వంటగది నిర్మాణానికి అయ్యే ఖర్చు నివేదికను అందజేయాలని కోరారు. అనంతరం పాఠశాల సిబ్బందితో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేద విద్యార్థులను తాము శాయశక్తులా ఆదుకుంటామన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని జీవితంలో రాణించాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది ఆయనను దుశ్శాలువతో సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, నంజుండ పాల్గొన్నారు.

తుఫాను ప్రభావంతో కమ్ముకున్న మేఘాలు



రోడ్డును కమ్మేసిన పొగమంచు

మడకశిరటౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజుల నుండి తుఫాను ప్రభావంతో మేఘాలు కమ్ముకోవడంతో ప్రజలను చలి వణికిస్తోంది. ఒక వైపు మేఘాలు కమ్ముకోవడం, మంచు కురుస్తోండటంతో ప్రజలు ఇంటి నుండి బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8 గంటలైనా మబ్బులాగే ఉండటం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం 5 గంటల కల్లా మంచు కమ్ముకొని చలి ఎక్కువగా ఉండటం వల్ల ప్రజలు అల్లాడి పోతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, ముసలివారు చలికి తట్టుకోలేకపోతున్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.2లక్షల విరాళం

గుడిబండ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.సి.గిరి గ్రామ సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న వీరభద్రస్వామి ఆలయ నిర్మాణానికి ధర్మస్థళ ట్రస్టు ప్రతినిధి దినేష్ రూ.2లక్షల నగదును విరాళంగా అందజేశారు. శుక్రవారం వీరభద్రస్వామి ఆలయ ట్రస్టు అధ్యక్షులు వీరభద్రస్వామికి రూ.2లక్షల నగదును విరాళంగా అందజేశారు. దీంతో మంజునాథ ట్రస్టు సభ్యులకు దేవాలయ ప్రతినిధులు సదాశివగౌడ్, పవన్‌కుమార్, తిప్పేస్వామి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

విధి నిర్వహణలో సెక్యూరిటీ గార్డు మృతి

గోరంట్ల, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం పంచాయతీ బెల్లాలచెరువు సమీపంలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న నంజప్ప (55) గురువారం రాత్రి విధులు నిర్వహిస్తూ మృతిచెందారని పోలీసులు తెలిపారు. వడిగేపల్లి గ్రామానికి చెందిన నంజప్ప సెక్యూరిటీగార్డుగా పనిచేస్తూ గురువారం రాత్రి విధులు నిర్వహిస్తూ, 11గంటలవరకు సైట్ ఇంజనీర్ అలీతో చాలసేపుమాట్లాడిన్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. అనంతరం స్టోర్ గదిలోకెళ్లి నిద్రించారని, శుక్రవారం ఉదయం ఎంతసేపటికి లేవకపోవడంతో అతని కుమారునికి సమాచారం అందించారన్నారు. డయల్ 100కు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ బాబు సంఘటనాస్థలానికి వెళ్లి తలుపులు పగలకొట్టించి, పరిశీలించారు. గుండెపోటుతో మృతిచెంది ఉంటారని కుటుంబసభ్యులు తెలపడంతో, పోలీసులు వారి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అయితే పరిశ్రమ వారు మృతుని కుటుంబానికి పరిహారం అందించడంలో తేడా రావడంతో శవాన్ని అక్కడే ఉంచి నిరసన తెలిపారు. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు వెళ్లి ఇరువర్గాల వారితో మాట్లాడారు.